నాట్యం మంత్రముగ్ధం

విశాలాంధ్ర–తిరుపతి కలెక్టరేట్: తిరుచానూరు శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆదివారం సాయంత్రం నిర్వహించిన భరతనాట్య నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. చెన్నైకి చెందిన మెలూస్టెప్ డ్యాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో, గురువు ఐశ్వర్య సురేష్ శిష్యులు సంప్రదాయ భరతనాట్య శైలిలో ప్రదర్శనలు ఇచ్చారు. నృత్యాలలోని లయ, భావ, అభినయాలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. కార్యక్రమంలో పుష్పాంజలి, అలారిప్పు, నటేశ కౌతువం, ఆండాళ్ కౌతువం, నెమలి నృత్యం, మాడు మీడియం కన్నా, దేవి నీయే, శ్లోక నృత్యం, శ్రీమన్నారాయణ నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ ప్రదర్శనల్లో చిన్నారులు అధీర, తారా శగీత్, అద్వైత, జనని తనుశ్రీ, మిర్షికశ్రీ, యశస్విని రెడ్డి, మృతుల్ యోగప్రకాశ్ తమ ప్రతిభను చాటుతూ ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. కార్యక్రమం అనంతరం పాల్గొన్న కళాకారులకు శిల్పారామం పరిపాలన అధికారి (ఏఓ) బి.సుధాకర్, సాంస్కృతిక కార్యక్రమాల ఇన్‌చార్జ్ అధికారి కె.ఖాదర్ వల్లి, ఏఈ రాధాకృష్ణ ప్రశంస పత్రాలు అందజేశారు.

విశాలాంధ్ర

తిరుపతి జిల్లా

చిత్తూరు జిల్లా

వైకుంఠ పర్వదినాలకు కట్టుదిట్ట భద్రత

- తిరుమల, తిరుపతిలో ప్రత్యేక పోలీస్ బందోబస్తు
- జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు

విశాలాంధ్ర–తిరుపతి కలెక్టరేట్: వైకుంఠ ఏకాదశి (డిసెంబర్ 30), వైకుంఠ ద్వాదశి (జనవరి 8) పర్వదినాలను పురస్కరించుకొని తిరుమల, తిరుపతి నగరం అలాగే జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆలయాలలో భక్తుల భద్రతకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు తెలిపారు. ఈ సందర్భంగా తిరుచానూరులోని ఎస్ఎస్వీ కల్యాణ మండపంలో పోలీసు అధికారులు, సిబ్బందితో నిర్వహించిన భద్రతా సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు మాట్లాడుతూ., వైకుంఠ ఏకాదశి, ద్వాదశి పర్వదినాల సందర్భంగా తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి వైకుంఠ ద్వార దర్శనానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సమగ్ర భద్రతా ప్రణాళిక అమలు చేస్తున్నట్లు తెలిపారు. తిరుమలలో సుమారు 2,000 మంది, తిరుపతి నగరంలో సుమారు 1,500 మంది పోలీసు సిబ్బందితో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అలాగే జిల్లా వ్యాప్తంగా ఉన్న అనుబంధ ఆలయాలు, స్థానిక దేవాలయాలలో కూడా ప్రత్యేక భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. వైకుంఠ ద్వార దర్శనం డిసెంబర్ 30 నుండి జనవరి 8 వరకు మొత్తం 10 రోజుల పాటు కొనసాగుతుందని తెలిపారు. డిసెంబర్ 30, 31, జనవరి 1 తేదీలలో టోకెన్లు ఉన్న భక్తులకు మాత్రమే దర్శనం ఉంటుందని వెల్లడించారు. ఆన్లైన్ ద్వారా సుమారు 25 లక్షల మంది భక్తులు దరఖాస్తు చేసుకోగా, ఒక్కో రోజుకు 60 వేల టోకెన్ల చొప్పున దర్శనాలు కేటాయించినట్లు వివరించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్ నియంత్రణ, క్యూలైన్ నిర్వహణ, సీసీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా నిఘా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. టీటీడీ అధికారులతో సమన్వయం చేసుకొని శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. భక్తులు క్రమశిక్షణతో వ్యవహరించి పోలీసులకు సహకరించాలని, పిల్లలు, వృద్ధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు. టీటీడీ నిబంధనలు, పోలీసుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు.

పేదలకు భూములు పంచిన ఘన చరిత్ర సిపిఐదే

సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి

విశాలాంధ్ర–తిరుపతి రూరల్: ప్రాంతాలలో భూ పోరాటాల ద్వారా వేలాదిమంది పేదలకు ఇల్లు స్థలాలు పంచిన ఘనత సిపిఐదని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి అన్నారు. సిపిఐ 101వ ఆవిర్భవ దినోత్సవం సందర్భంగా వేదాంతపురం, మార్క్స్ నగర్ నందు అరుణ పతాకాన్ని ఎగరవేసి, కేక్ కట్ చేసి కమ్యూనిస్టు పితామహుడు కారల్ మార్క్స్ కు ఘన నివాళు లర్పించారు. సిపిఐ 101 ఆవిర్భావం సందర్భంగా తిరుపతి అర్బన్ 3వ డివిజన్ ప్రగతి నగర్ సిపిఐ శాఖ లో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, పద్మావతి పురం సిపిఐ శాఖ లో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.రాధాకృష్ణ ఎర్రజెండాను ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి మాట్లాడుతూ తిరుపతిలో ఇళ్ల స్థలాలు లేని వేలాదిమంది నిరుపేదలను గుర్తించి భూ పోరాటాల సాగించి అరెస్టులు, లాఠీ దెబ్బలు, కేసులు, జైలు శిక్షలు అనుభవించి సుమారు 24 కాలనీలను నిర్మించి పేదలకు అండగా నిలిచిందని అందులో వేదాంతపురం భూ పోరాటం కమ్యూనిస్టు వందేళ్ల చరిత్రలో మేలురాయిగా అభివర్ణించారు. ఇల్లు లేని కష్టజీవులకు కారల్ మార్క్స్ నగర్ నిలయంగా మారిందన్నారు. జనవరి 18న తెలంగాణ రాష్ట్రం ఖమ్మంలో జరిగే సిపిఐ, శతాబ్ది ఉత్సవాలకు కార్మికులు, కష్టజీవులు తరలిరావాలని కోరారు. అనంతరం వేదాంతపురం సర్కిల్లో సిపిఐ జిల్లా సమితి సభ్యులు చిన్నం కాలయ్య ఎర్రజెండా ఎగర వేసి కమ్యూనిస్టుల ఘన చరిత్రను కొనియాడారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య 101వ సిపిఐ జయంతి సందర్భంగా కేక్ ను కట్ చేసి మాట్లాడుతూ తిరుపతిలో భూకబ్జాలను, రౌడీయిజాన్ని, దౌర్జన్యాలను సిపిఐ ఎదిరించి నిలిచిందన్నారు. ప్రభుత్వ భూములు, చెరువులు కబ్జా కాకుండా నిత్యం ప్రజా సమస్యలపై పోరాడుతూ అభివృద్ధికి నోచుకోలేని అనేక కాలనీలలో మౌలిక వసతులు కల్పించాలని, ఎర్రజెండా ఉద్యమాలు నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కే.రాధాకృష్ణ, బి. నదియా, సిపిఐ నగర కార్యదర్శి జల్లా విశ్వనాథ్, జీవకోన కార్యదర్శి చిన్నం కాలయ్య, ఆర్. సి రోడ్ బ్యాంక్ కాలనీ కార్యదర్శి జింక నాగరాజ్, ఎం.ఆర్. పల్లి కార్యదర్శి ఆర్.బలరాం, లెనిన్ నగర్ కార్యదర్శి ఎం ఆర్ బాబు, ఓటేరు కార్యదర్శి కే పద్మనాభరెడ్డి, ప్రగతి నగర్ శాఖ కార్యదర్శి చంద్రారెడ్డి, మార్క్స్ నగర్ కార్యదర్శి కె.రామ్మూర్తి, పద్మావతి పురం శాఖ కార్యదర్శి లక్ష్మీ, సహాయ కార్యదర్శులు రాము, చలపతి, వై సూర్య, మోహన్, ప్రియ, రాజశేఖర్, వెంకట్, గోవిందరెడ్డి, మురుగ, జైపాల్, ఇంద్రాణి, మల్లీశ్వరి, లక్ష్మమ్మ, ఈశ్వరయ్య, భూపతి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల పనులు ప్రారంభించిన ఎమ్మెల్సీ

విశాలాంధ్ర–శాంతిపురం: శాంతిపురం మండలం రాళ్ళబుదుగురు పంచాయతీకి చెందిన బండతిప్పన పల్లి గ్రామంలో శనివారం సీసీ రోడ్ల పనులు ప్రారంభమైనవి. ఈ ప్రారం భోత్సవానికి ఎంఎల్సి కంచర్ల శ్రీకాంత్ ముఖ్య అతిథిగా పాల్గొనడం జరిగి నది. ఎంఎల్సి చేతుల మీదుగా సీసీ రోడ్ల ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగినది. గత కొన్ని రోజుల నుండి కుప్పం నియోజకవర్గంలో సీసీ రోడ్లు,వీధి దీపాలు అమర్చడం వంటి కార్యక్రమాలను అట్టహాసంగా జరుపుటకు సన్నాహాలు జరుగుతున్న విషయం తెలిసినదే. ఇందులో భాగంగా రోడ్ల పనులు ప్రారంభించడం జరిగినది. ఈ సందర్భంగా రోడ్లు వేసేటటువంటి ఇంజనీర్లును, కాంట్రాక్టర్లను పనులు సకాలంలో పూర్తి చేయాల్సిందిగా ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తెలియజేశారు. అనంతరం పాఠశాలను సందర్శించి అక్కడే మధ్యాహ్న భోజనం చేయడం జరిగినది. ఈ కార్యక్రమానికి టిడిపి అధ్యక్షులు ఉదయ్ తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బస్సు, కంటైనర్ లారీ ఢీ.. తృటిలో తప్పిన భారీ ప్రమాదం

విశాలాంధ్ర–గుడిపాల: గుడిపాల మండలంలో బుధవారం ఉదయం బస్సు మరియు కంటైనర్ లారీ ఢీకొన్న ఘటనలో భారీ ప్రమాదం దీ తృటిలో తప్పింది. ఈ సంఘటన ఉదయం సుమారు 11:15 గంటల ప్రాంతంలో చిత్తూరు వేలూరు రహదారిపై పనాటూర్ గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. వేలూరు వైపు నుండి చిత్తూరు వైపునకు అయ్యప్ప స్వాములు ప్రయాణిస్తున్న బస్సు, అదే సమయంలో చిత్తూరు నుండి వేలూరు వైపునకు వెళ్తున్న కంటైనర్ లారీ ఒకదానికొకటి ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కంటైనర్ లారీ డ్రైవర్‌కు కాలుకు తీవ్ర రక్తగాయం కాగా, ఆయనను చికిత్స నిమిత్తం వెంటనే సమీప ఆసుపత్రికి తరలించారు. బస్సు డ్రైవర్‌కు స్వల్ప గాయాలు కాగా, ప్రాణాపాయం తప్పింది. ప్రమాదంలో బస్సు మరియు కంటైనర్ లారీ రెండింటి ముందుభాగాలు తీవ్రంగా ధ్వంసమయ్యాయి. ప్రమాద సమయంలో బస్సులో ప్రయాణికులు ఎక్కువగా లేకపోవడంతో పెద్ద ఎత్తున ప్రాణ నష్టం జరగలేదని స్థానికులు తెలిపారు. సంఘటన సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను నియంత్రించి, ప్రమాదానికి గల కారణాలపై విచారణ ప్రారంభించారు.

చిన్నపోడుచేనులో జల్లికట్టు.. భారీగా తరలివచ్చిన జనం

విశాలాంధ్ర–వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం పంచాయతీ చిన్నపోడుచేను లో ఆదివారం జలికట్టు అట్టహాసంగా నిర్వహించారు. ముందస్తు ప్రచారం ఉండడం తో జిల్లా లోని పలు ప్రాంతాల నుంచి జలికట్టు లో పందేలకు పశువులను తీసుకొచ్చారు. పశువులను సుందరంగా అలంకరించి వాటి కొమ్ములకు టీడీపీ, వైకాపా జెండాల తో పాటు సినీనటుల ఫొటోలు ఉన్న పట్టీలు కట్టి జనం లోకి వదిలారు. పరుగులు తీస్తూ వచ్చే పశువులను నిలువరించి పట్టీలు కైవసం చేసుకునే క్రమంలో సాహసికులకు కొందరికి చిన్నపాటి గాయాలయ్యాయి.జలికట్టు చూసేందుకు పలు ప్రాంతాల నుంచి జనం తరలివచ్చారు. గ్రామ పరిసరాలు వాహనాలు, జనంతో నిండిపోయింది. కార్యనిర్వాహకులు అన్నదానం చేశారు.సంక్రాంతి సంబరాల్లో భాగంగా నిర్వహించే జలికట్టు ఈదఫా ముందస్తుగా నే ప్రారంభించారని చెప్పొచ్చు. చిదురుముదురు ఘటనల మినహా జలికట్టు ప్రశాంతంగా ముగిసింది.

తుమ్మలగుంటలో తుది దశకు చేరుకున్న వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లు

- అత్యద్భుతంగా ముస్తాబవుతున్న వైకుంఠ ద్వారం
- ఏర్పాట్లను పర్యవేక్షించిన చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

విశాలాంధ్ర–తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగే వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి. గత వారం రోజులుగా సాగుతున్న ఏర్పాట్లు దాదాపు పూర్తి కావడంతో ఎక్కడా లోపాలు తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యులు, తుడా మాజీ ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆదివారం పర్యవేక్షించారు. ఆలయం లోపల, బయట జరుగుతున్న పనులను పరిశీలించిన ఆయన అక్కడ పనులు చేస్తున్న కార్మికులు, చేయిస్తున్న గ్రామ పెద్దలకు పలు సూచనలు చేశారు. ఇప్పటికే ఆలయం లోపల బయట శుద్ధి కార్యక్రమాన్ని పూర్తి చేసిన కార్మికులు అందరినీ ఆకట్టకునేలా అందమైన చలువ పందిర్లు వేశారు. వైకుంఠ ఏకాదశి పర్వదినం రోజున స్వామి దర్శనార్థం వచ్చి వైకుంఠ ద్వార ప్రవేశం చేసే భక్తులకు ఏలాంటి అసౌకర్యం కలుగకుండా, ఎక్కడా లోటుపాట్లు కనిపించకుండా చేయడానికి అహర్నిశలు శ్రమిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డిలు పనుల పురోభివృద్ధిపై సమీక్ష చేశారు. ఇప్పటికే పనుల నిర్వహణ బాధ్యతలు అప్పగించిన పెద్దలతో ఆలయం వద్ద సమావేశమై ఏఏ పనులు ఎంత మేరకు పూర్తి చేశారు, ఎప్పటిలోపు ముగిస్తారన్న వివరాలను తెలుసుకున్నారు. అనంతరం జరుగుతున్న పనులను స్వయంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆలయంలో భక్తులు ప్రవేశించే వైకుంఠ ద్వారాన్ని అత్యద్భుతంగా తయారు చేస్తున్నారు. శ్రీవారి దశావతారాల ప్రతిమలతో పాటు అష్ట లక్ష్మీ దేవిల ప్రతిమను వైకుంఠ ద్వారంలో ఏర్పాటు చేయించి అత్యద్భుతంగా ముస్తాబు చేస్తున్నారు. దేశ, విదేశాల నుంచి వచ్చిన పుష్పాలతో అలంకరణ చేసి భక్తులకు కనువిందు చేయనున్నారు. స్వామి వారి దర్శనానంతరం వైకుంఠ ద్వారంలోకి వెళ్లిన భక్తులకు గోవింద నామాలు వినపడేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. గర్భాలయంతో పాటు పరివార దేవతా మూర్తుల ఆలయాల్లో కూడా ప్రత్యేకంగా అలంకరణ చేయిస్తున్నారు.తుమ్మలగుంట తెలుగుతల్లి సర్కిల్ నుంచి శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయం వరకు వెళ్లే ప్రధాన రహదారిలో వాహనాల రాకపోకలకు అవకాశమే లేకుండా స్వామి, అమ్మవార్లు బ్రహ్మోత్సవాల్లో విహరించే వాహనాలను ఏర్పాటు చేయనున్నారు. భక్తులు స్వామి దర్శనానికి వచ్చే ముందు ఆ వాహనాలను దర్శించుకుని వచ్చేలా ఏర్పరచనున్నారు. తెలుగు తల్లి నుంచి రెండు వరుసల రహదారికి ఇరువైపులా పార్కింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. భక్తులు తమ వాహనాలను పార్కింగ్‌లో పెట్టి ఆలయం వద్దకు నడచి మాత్రమే రావాలని చెవిరెడ్డి మోహిత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. పోలీసులు, ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బంది పార్కింగ్ వ్యవహారాలు చూసేలా బాధ్యతను అప్పగించారు. ఆలయం వద్ద తమ సేవలు అందించడానికి యువత పెద్ద ఎత్తున తరలి రావడంతో వారందరికీ ఏఏ రకమైన పనులు చేయాలో విసదీకరించారు. చివరగా వైకుంఠ ఏకాదశి మరుసటి రోజు ద్వాదశి పర్వదినాన పుష్కరణిలో జరిగే చక్రస్నానంకు జరుగుతున్న ఏర్పాట్లను ఆయన పరిశీలించారు.

చిత్తూరునగర శివారు కాలనీలకు
మౌలిక వసతులు కల్పించకుంటే పోరాటం తప్పదు

సిపిఐ జిల్లా కార్యదర్శి యస్.నాగరాజు

విశాలాంధ్ర–చిత్తూరు: చిత్తూరు నగర శివారు ప్రాంతాలకు మౌలిక వసతులు కల్పించకపోతే ఆందోళనలు తప్పవని సిపిఐ జిల్లా కార్యదర్శి నాగరాజ్ హెచ్చరించారు. భారత కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాల సందర్భంగా ఆదివారం లెనిన్ నగర్ కాలనీలో సిపిఐ జెండాను సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్. నాగరాజు ఆవిష్కరించారుఈ కార్యక్రమం లెనిన్ నగర్ పార్టీ శాఖ కార్యదర్శి కె.మణి, నాయకత్వం వహించారు ఈ సందర్భంగా యస్.నాగరాజు,సిపిఐ చిత్తూరు నగర కార్యదర్శి వి.సి. గోపీనాథ్ లు మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పోరాట ఫలితంగా 1981 సంవత్సరంలో బీడీ కార్మికుల కోసం ఏర్పాటు అయిన కాలనీ లెనిన్ నగర్ అన్నారు. హౌసింగ్ కాలనీ, ఇందిరమ్మ కాలనీ ప్రభుత్వం ఏర్పాటు చేసి సుమారు 2000 కుటుంబాలు కాపురాలు ఉన్నారని కాలనీలో కొంతమేరకు మాత్రమే సిసి రోడ్లు వేశారు తప్ప ఎక్కువ శాతం వీధిలో సిసి రోడ్ లేక మురికి కాలువలు లేక కొన్నిచోట్ల వీధిలైట్లు లేక కాలనీవాసులు ఇబ్బందులకు గురి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి వేళలో కుక్కల బెడద తీవ్రంగా ఉందని వాపోయారు సంబంధిత అధికారులు కుక్కలను పట్టి కుక్కల బెడద నుండి కాలనీవాసులను కాపాడాలని డిమాండ్ చేశారు. 1981 నుండి అధికారంలోకి ఎంతమంది వచ్చినా ప్రజలకు కాలనీ వాసులకు మౌలిక సదుపాయం అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని తప్పుపట్టారు. ఇప్పటికైనా అధికారులు జోక్యం చేసుకొని కాలనీ వాసులకు మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోరాటం తప్ప వేరే మార్గం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమావేశంలో పార్టీ శాఖ కార్యదర్శి కే.మణి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దాసరి చంద్ర, కే.రమాదేవి, కే.విజయ గౌరీ, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రవీణ్ కుమార్, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కుమారి, రఘు, బాలాజీ రావు, ఫైరోజ్, జమీలాభి, కాలనీ నాయకులు చాంద్ భాషా, దీప, కలై వాణి, కార్తీక్, మార్గ బంద్ పాల్గొన్నారు.

లైటింగ్ షో మూడునాళ్ళ ముచ్చటేనా..?

విశాలాంధ్ర–చంద్రగిరి: చంద్రగిరి రాయల కోటలో లైటింగ్ షో మూడునాళ్ళ ముచ్చటగా ముగిసింది. అప్పటి తెలుగుదేశం పార్టీ హయాంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యాటక రంగానికి పెద్దపీట వేసి చంద్రగిరి రాయల కోట లో 2.5 కోట్ల రూపాయలు వెచ్చించి ప్రతిష్టాత్మకంగా ఆయన చేతులమీదుగా నే మే 21. 2000 సంవత్సరంలో ప్రారంభించారు. దీంతో కోటకు సందర్శకులు నుండి మంచి స్పందన లభించి రాష్ట్ర పర్యాటక శాఖ కు మంచి ఆదాయం సాలు సరి సుమారు 15 లక్షల రూపాయలు వస్తూండేది. ఎల్ఈడి కొత్త టెక్నాలజీతో అప్పటి ప్రభుత్వం 3.5 కోట్ల రూపాయలు వెచ్చించి 17.11.2017 లో తిరిగి ప్రారంభించారు. 18.06.2018 సంవత్సరంలో కురిసిన భారీ వర్షాలకు పిడుగు పడి కంట్రోల్ సిస్టమ్స్ దెబ్బతినగా అప్పటి నుండి ఇప్పటి వరకు అది పునరుద్ధరణకు నోచుకోక పోవడం విచారకరం. జగన్ ప్రభుత్వ హయాంలో సదరు లైటింగ్ షో నిర్వాహనను మరమ్మతులు చేసి ప్రైవేటు యాజమాన్యం వారు నిర్వహించుకోవాలని తెలిపినారే కానీ అది అతి, గతికి నోచుకోలేదు. లైటింగ్ షో వల్ల పర్యాటక శాఖ కు ఆదాయం రావటమే కాకుండా స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు కూడా ఉండేవి. రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తామనే ఊకదంపుడు ఉపన్యాసాలు విని వేసారిపోతున్నామే తప్ప ఇక్కడ ఉన్న ఈ చారిత్రాత్మక పురాతన కేంద్రాన్ని అభివృద్ధి పరచలేదని తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. లైటింగ్ షో తో పాటు ఇక్కడి కోనేరులో బోటింగ్ కూడా లేక కోనేరు పాచిపట్టి అందుకు వెచ్చించి న నిధులు వృధా అయ్యాయి. దీంతో పురావస్తు శాఖ ఆధ్వర్యంలో ఉంటున్న రాయల కోటను సందర్శించేందుకు సుదూర ప్రాంతాల నుండి శ్రీవారి ఆలయానికి వచ్చే భక్తులు కేవలం రాజ మహల్, రాణి మహల్‌గా పిలవబడే ప్రాకారాలు, రాజమహల్‌లో ఏర్పాటు చేసిన తవ్వకాల్లో బయట పడిన పంచలోహ విగ్రహాలు, మొండి గోడలు చూసి ఓసి ఇంత మాత్రానికే ఇక్కడకు వచ్చామా అంటూ ఉసూరుమం టూ వెళుతున్నారు. తిరుపతి చిత్తూరు రహదారి నుండి రాయల కోటకు వెళ్లే రహదారిలో అప్పట్లో రైతు ఉండగా ప్రస్తుతం లైట్లు లేక కళ్ళు చీకటిలో పర్యాటకులు భయంతో గడుపుతున్నారు. శుక్రవారం అయితే మ్యూజియం కూడా తెరవక కేవలం మొండి గోడలు మాత్రమే చూసి వెళుతున్నారు. రాయలకోట ను సందర్శించే పర్యాటకులకు ఇక్కడ కనీసం క్యాంటీన్ వసతి కూడా లేకపోవడంతో చిన్నపిల్లలు వృద్ధులతో వచ్చే యాతరుకులు పర్యాటకులు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు.

జూన్ 18.05.25న శాసన సభ్యులు పులివర్తి నాని కోటను సందర్శించి ఆంధ్రప్రదేశ్ టూరిజం కార్పొరేషన్ నిర్వహించి జూన్ మొదట వారం నుంచి కోటలో వెలుగులు చూపిస్తుందన్నారు. ఆయన మాటలు రాయల కోటను దాటలేదు. ఇతర రాష్ట్రాల నుండి తిరుమలకు వచ్చే, వెళ్ళే యాత్రికులు జాతీయ రహదారి పక్కనే ఉన్న పురాతన టెక్నాలజి ఉపయోగించి అతి పెద్ద పెద్ద రాళ్ళను కోట చుట్టూ పురాహారి గోడలు ఏర్పాటు చేయగా సదరు గోడలను చూడాలన్న ఆశ కోట గోడ చుట్టూ చెట్లు చదారాలతో నుండి కోట గోడ పూర్తిగా కనిపించక అంతంత మాత్రమే అయింది. చంద్రగిరి రాయలకోటను అభివృద్ధి పరచడం మాట అలా ఉంచితే ఉన్న దానిని సంరక్షించు కోలేని పరిస్థితిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నాయి. ప్రజా ప్రతి నిధులు సైతం ఈ అంశంపై దృష్టి సారించకపోవడం విచారకరం. తొందరలో రాయలకోటలో లైటింగ్ షో, బోటింగ్‌ను పునరుద్ధరించాలని సందర్శకులు కోరుకుంటున్నారు.

విశాలాంధ్ర

ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్‌గా చిర్రి హరికృష్ణ

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: తిరుపతి జిల్లా కేవీబీపురం మండలం, అంజూరు ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా సేవలందిస్తున్న చిర్రి హరికృష్ణ, రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర కౌన్సిలర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవలే జరిగిన సంఘం జిల్లా కార్యవర్గ ఎన్నికల్లో ఆయనను ఈ పదవికి ఎంపిక చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. అంజూరు ఉన్నత పాఠశాలలో నిబద్ధత గల ఉపాధ్యాయుడిగా గుర్తింపు పొందిన హరికృష్ణ, గత కొంతకాలంగా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం, ఎస్టీయూ సంఘం బలోపేతం కోసం చురుగ్గా పనిచేస్తున్నారు. ఆయన పనితీరును గుర్తించిన ఉపాధ్యాయ లోకం, ఆయనను రాష్ట్ర స్థాయి ప్రతినిధిగా (స్టేట్ కౌన్సిలర్) ఎన్నుకుంది. రాష్ట్ర కౌన్సిలర్‌గా ఎన్నికైన సందర్భంగా హరికృష్ణకు మండల విద్యాశాఖ అధికారులు, తోటి ఉపాధ్యాయులు, ఎస్టీయూ నాయకులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

ముక్కంటి సేవలో మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీకాళహస్తి క్షేత్రాన్ని మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పవన్ కుమార్ ద్వివేది ఆదివారం సందర్శించారు. కుటుంబ సమేతంగా విచ్చేసిన ఆయనకు ఆలయ అధికారులు ఘనస్వాగతం పలికారు. న్యాయమూర్తి ద్వివేది దంపతులు శ్రీకాళహస్తీశ్వర స్వామి వారిని, జ్ఞానప్రసూనాంబ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు వీరికి అంతరాలయ దర్శనం కల్పించి, స్వామివారి వైభవాన్ని వివరించారు. అనంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో వేద పండితులు వారికి వేద ఆశీర్వచనం అందజేసి, తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి, ప్రోటోకాల్ ఏఈఓ మోహన్, ఆలయ పర్యవేక్షకులు నాగభూషణం, ఏపీఆర్‌ఓ రవి, స్థానిక కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో పిజిఆర్ఎస్

మీ కోసం 1100 సేవలు ప్రజలు వినియోగించుకోవాలని కలెక్టర్ పిలుపు

విశాలాంధ్ర-తిరుపతి కలెక్టరేట్: తిరుపతి జిల్లా ప్రజలు మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన అర్జీలు ఇంకా పరిష్కారం కాకపోయినా, లేదా ఫిర్యాదుల స్థితిగతులపై సమాచారం తెలుసుకోవాలన్నా 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చని పేర్కొన్నారు. అలాగే Meekosam.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ప్రజలు తమ అర్జీలను నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 29వ తేదీ సోమవారం (నేడు) తిరుపతి కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. అర్జీదారులు తమ పూర్తి వివరాలతో పాటు సమస్యలకు సంబంధించిన అర్జీలను సమర్పించాలని, గతంలో అర్జీలు ఇచ్చిన వారు సంబంధిత రసీదులు తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైన వెంటనే ఫోన్‌కు ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం అందుతుందని, నోటీసులు, ఎండార్స్‌మెంట్లు వాట్సాప్ తో పాటు రిజిస్టర్ పోస్టు ద్వారా పంపుతున్నట్లు తెలిపారు. జిల్లా ప్రజలు ఈ పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

వేగం కన్న ప్రాణం మిన్న

హెల్మెట్ ధరించండి ప్రాణాలను కాపాడుకోండి: శ్రీసిటీ ఎస్ఐ ప్రియాంక

విశాలాంధ్ర-వరదయ్యపాలెం: తిరుపతి జిల్లా వరదయ్యపాలెం మండలం శ్రీసిటీ హైటెక్ పోలీస్ స్టేషన్ పరిధి బత్తలవల్లం చెక్ పోస్ట్ వద్ద ఆదివారం శ్రీసిటీ పోలీసులు ఎస్ఐ ప్రియాంక ఆధ్వర్యంలో వారి బృందం మొగిలి రెడ్డి, మునస్వామి లతో కలసి ముమ్మర వాహన తనిఖీలు నిర్వహించారు. ద్విచక్ర వాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు, హెల్మెట్ ధరించని వాహన ధారులకు అపరాధ రుసుము విధిస్తూ, వేగం కన్న ప్రాణం మిన్న, రోడ్డు భద్రత నియమాలను పాటిస్తూ ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని చిన్నపాటి నిర్లక్ష్యం మీ కుటుంబాన్ని రోడ్డున పడేయొచ్చుఅని ట్రాఫిక్ నిబంధనలు ఉన్నది మీ రక్షణ కోసమే క్షేమంగా వారి వారి గమ్యాలకు సురక్షితంగా చేరుకోవాలని తెలిపారు..

గౌరవ డాక్టరేట్‌తో కే.బి.గురుదేవ్‌కు అంతర్జాతీయ గుర్తింపు

విశాలాంధ్ర-వరదయ్యపాలెం: సమాజానికి సేవే లక్ష్యంగా, నిరంతరం ప్రజల మధ్య ఉంటూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న కే.బి. గురుదేవ్‌కు ఇంటర్నేషనల్ తమిళ కల్చరల్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ అందించడం గర్వకారణం. సామాజిక సేవా రంగంలో ఆయన చేసిన కృషికి ఇది వచ్చిన సముచిత గుర్తింపు. దేవాంగ అభ్యుదయ సేవా సంఘం రాష్ట్ర ప్రతినిధిగా కే.బి. గురుదేవ్ సేవలు ప్రశంసనీయమైనవి. సమాజ అభ్యుదయమే లక్ష్యంగా అనేక కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లారు. ముఖ్యంగా చేనేత,ప్రింటింగ్ వస్త్ర పరిశ్రమల్లో దేశ-విదేశాల్లో వ్యాపారం విస్తరించి, అనేక మందికి ఉపాధి కల్పించిన కుటుంబంగా ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారు. విద్యారంగంలో కే.బి. గురుదేవ్ విజయలక్ష్మి దంపతుల సేవలు అనిర్వచనీయమైనవి. యాభై ఏళ్లకు మునుపే వీరి కుటుంబం, వరదయ్యపాలెంలో వీవర్స్ శాల ఏర్పాటు చేసి ఉపాధి కల్పించారు. విద్యే సమాజాభివృద్ధికి పునాది అనే నమ్మకంతో, విద్యా ప్రోత్సాహానికి వారు చేసిన కృషి ప్రశంసనీయం. ఈ సందర్భంగా ఏఐడిడికేకేఎఫ్ నేషనల్ ప్రెసిడెంట్ అరుణ్ వరోడే, ఏపీ దాస్ కన్వీనర్ గుత్తి త్యాగరాజు, కో-కన్వీనర్ జక్కుల శివానందం, టీడీపీ దేవాంగ సాధికారిక సమితి చైర్మన్ బీరక ప్రసాద్,పూర్వపు దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్లు బొప్పన తిలక్ బాబు, మెట్ల శైలశ్రీ-దుర్గ నాగ మల్లేశ్వరరావు దంపతులు, చిత్తూరు పార్లమెంట్ కన్వీనర్ జి. ఉదయకుమార్,తిరుపతి చల్ల శ్రీనివాసులు తదితర ప్రముఖులు అభినందనలు తెలిపారు. అలాగే తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, ఇతర రాష్ట్రాల నుంచి,విదేశాల నుండి ఆయన శ్రేయోభిలాషులు శుభాకాంక్షలు తెలియజేశారు. సమాజానికి సేవ చేస్తే గౌరవం తానుగా వస్తుందన దానికి కే.బి. గురుదేవ్ జీవితం మంచి ఉదాహరణ. ఆయనకు లభించిన ఈ గౌరవ డాక్టరేట్ మరింత మంది యువతకు సేవా భావనతో ముందుకు సాగేందుకు ప్రేరణగా నిలవాలని ఆశిద్దాం.

యువత హద్దులు దాటితే చర్యలు తప్పవు

విశాలాంధ్ర-దక్కిలి: నూతన సంవత్సర సందర్భంగా నిబంధనలు మీరి యువత హద్దులు దాటితే చర్యలు తప్పవని స్థానిక ఎస్సై శివ శంకర్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఉన్న పోలీస్ స్టేషన్‌లో న్యూ ఇయర్ వేడుకలపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యూ ఇయర్ వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన, సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలిగించిన చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఇక వేడుకలను కుటుంబ సమేతంగా, ఇళ్లలో సంతోషంగా నిర్వహించుకోవాలన్నారు. అంతే కాకుండా మద్యం సేవించి వాహనాలు నడపిన, ద్విచక్ర వాహనంలో ముగ్గురు ఎక్కించుకున్నా, రాష్ డ్రైవింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్, సైలెన్సర్లతో పెద్ద పెద్ద శబ్దాలు చేస్తూ బైకులు నడపడం, దాడులు, బెదిరింపులకు పాల్పడడం, ఎక్కడైనా డీజేలు వాడితే రోడ్లపై వెళ్ళేవారిని ఇబ్బందికి గురి చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఇక తల్లిదండ్రులు తమ పిల్లలను బయటకు పంపించి ఇబ్బందులు పడవద్దన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో న్యూ ఇయర్ వేడుకలు నిర్వహించుకోవాలన్నారు.

కస్తూరికండ్రిగలో కర్మక్రియలకు హాజరైన పులివర్తి

విశాలాంధ్ర-తిరుపతి కలెక్టరేట్: తిరుపతి రూరల్ మండలం, బ్రాహ్మణ పట్టు పంచాయతీ పరిధిలోని కస్తూరి కండ్రిగ గ్రామానికి చెందిన టిడిపి అభిమాని ఏనుగు హరి నాయుడు కర్మక్రియలకు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తనయుడు, పులివర్తి వినీల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన కూటమి నాయకులతో కలిసి కస్తూరికండ్రిగ గ్రామాన్ని సందర్శించి, హరి నాయుడు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం హరి నాయుడు కుటుంబ సభ్యులను పరామర్శించి, ఈ దుఃఖ సమయంలో తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అమిలినేని మధు, సింగిల్ విండో చైర్మన్ మధు శేఖర్, సురేంద్రనాయుడు కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రెక్కలు విప్పుతున్న రేషన్ బియ్యం దందా..!

అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నా పట్టించుకోని అధికారులు



విశాలాంధ్ర-సత్యవేడు: సత్యవేడులో రేషన్ బియ్యం దందా రెక్కలు విప్పుతోంది. రేషన్ బియ్యం అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతున్న అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. నిరుపేదలు ఆకలితో అలమటించకూడదన్న ఉద్దేశంతో నాడు దివంగత నేత, టిడిపి వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టి రామారావు రేషన్ బియ్యం పథకానికి శ్రీకారం చుట్టిన విషయం అందరికీ తెలిసిందే. అయితే పేదల కడుపు నింపాల్సిన రేషన్ బియ్యం పక్కదారి మళ్లుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే మండల కేంద్రమైన సత్యవేడులో పౌర సరఫరా శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న గోడౌన్ నుంచి ఆయా రేషన్ షాపులకు రేషన్ బియ్యం సరఫరా అవుతుంది. అయితే దీన్ని ఆశరా చేసుకొని కొందరు బియ్యం స్మగ్లర్సు రేషన్ బియ్యాన్ని సేకరించే పనిలో పడడం షరా మామూలుగా మారుతుంది. దీంతోపాటు కొందరు మహిళలు కూడా గ్రామాల వైపు పరుగులు తీసి రేషన్ బియ్యాన్ని సేకరించి స్థానికంగా ఉన్న స్మగ్లర్స్కు విక్రయిస్తున్నట్లు సమాచారం. పెద్ద ఎత్తున సహకరిస్తున్న రేషన్ బియ్యాన్ని మూడో కంటికి తెలియకుండా నిల్వ కేంద్రాల్లో దాచి ఉంచి మూడు రోజులకు ఒకసారి ఆటోలు, మినీవ్యాన్‌లు, బొలేరో వాహనాల ద్వారా అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. కిలో బియ్యాన్ని నాలుగు ఐదు రూపాయలకు కొనుగోలు చేసి స్మగ్లర్లకు కిలో ఎనిమిది రూపాయలకు వికరిస్తున్నట్టు తెలిసింది. ఇలా సేకరించి రహస్య ప్రాంతాల్లో నిల్వచేసిన బియ్యాన్ని స్మగ్లర్సు రాత్రి వేళలో మూడో కంటి తెలియకుండా సులూరుపేట, బెంగళూరు వాటి ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఒక్క సత్యవేడు పట్టణంలోని ఇద్దరు ముగ్గురు స్మగ్లర్ల కనుసనల్లో రేషన్ బియ్యం దందా కొనసాగుతున్నట్టు ఆరోపణ వినిపి స్తున్నాయి. దీంతోపాటు ఆంభాకం వంటి ప్రాంతాల్లో కూడా అక్కడ స్థానిక ప్రజాప్రతినిధి కనుసనల్లో సేకరిస్తున్న రేషన్ బియ్యాన్ని మామిడి తోపులో దాచి ఉంచి ఆటోల ద్వారా నాగలాపురం తరలిస్తున్నారు. ముఖ్యంగా రేషన్ బియ్యం ఎక్కడకక్కడ సేకరిస్తూ అక్రమంగా తరలిస్తున్న సంబంధిత అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రేషన్ దందాను అరికట్టడానికి రేషన్ దుకాణాల్లో ఈ పాస్,బయోమెట్రిక్ విధానం అమల్లోకి వచ్చిన ఫలితం లేకుండా పోతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రేషన్ దందాను అరికట్టాల్సిన సంబంధిత అధికారులు మొక్కుబడి దాడులు చేస్తున్నారే తప్ప నిర్దిష్టమైన చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఏమైనప్పటికీ రేషన్ బియ్యం అక్రమ దందాను మండల అధికారులు కట్టడి చేయడంలో విఫలమవుతున్నారనే ఆరోపణల్లో నిజం లేకపోలేదు. ఇప్పటికైనా దీనిపై సంబంధిత అధికారులు స్పందించి రేషన్ బియ్యం దందాను అరికట్టడానికి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

తొట్టంబేడు మండలంలో 'స్టార్టర్ల' కలకలం

ఒకే రాత్రి 58 మోటార్ల స్టార్టర్ల చోరీ

విశాలాంధ్ర-తొట్టంబేడు: మండలంలోని పలు గ్రామాల్లో గుర్తుతెలియని వ్యక్తులు రెచ్చిపోయారు. సాగునీటి కోసం రైతులు పొలాల్లో ఏర్పాటు చేసుకున్న విద్యుత్ మోటార్ల స్టార్టర్లను భారీ సంఖ్యలో దొంగిలించి రైతన్నలకు కంటిమీద కునుకు లేకుండా చేశారు. ఒకే రాత్రి ఏకంగా 58 స్టార్టర్లను ఎత్తుకెళ్లడం స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. వివరాల్లోకి వెళ్తే... మండల పరిధిలోని గురప్పనాయుడు కండ్రిగ, చిన్నకన్నలి, పెద్ద సింగమాల గ్రామాల్లో ఈ దొంగతనాలు జరిగాయి. పొలాల వద్ద ఉన్న మోటార్ల నుంచి స్టార్టర్లను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. గురప్పనాయుడుకండ్రిగ ఈ ఒక్క గ్రామంలోనే సుమారు 30 స్టార్టర్లు దొంగతనానికి గురయ్యాయి. చిన్నకన్నలి, పెద్దసింగమాల ఈ రెండు గ్రామాల్లో కలిపి 28 స్టార్టర్లను దొంగలు ఎత్తుకెళ్లారు. సాగు కాలంలో ఒకేసారి ఇన్ని స్టార్టర్లు చోరీకి గురవ్వడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఒక్కో స్టార్టర్ విలువ రూ.వేలల్లో ఉంటుందని, పంటలకు నీరు పెట్టాల్సిన సమయం లో ఇలా జరగడం వల్ల ఆర్థికంగా భారీ నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొలాల వద్ద వరుసగా జరుగుతున్న ఈ దొంగతనాలపై పోలీసులు నిఘా పెంచాలని గ్రామస్తులు కోరుతున్నారు. తక్షణమే విచారణ చేపట్టి దొంగలను పట్టుకోవాలని, తమకు న్యాయం చేసి ఆర్థిక నష్టం నుంచి కాపాడాలని బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కల్తీ విత్తనాలతో నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి

విశాలాంధ్ర-వరదయ్యపాలెం: సూళ్లూరుపేట నియోజకవర్గంలోని వరదయ్యపాలెం మండలం సూళ్లూరు పేట దొరవారిసత్రం మండలాల్లో సూళ్లూరుపేట లోని పూజిత ఆగ్రో సర్వీస్ సెంటర్‌లో సుమారు 1500 కల్తీ విత్తనాలను కొని నారు పోసి నాటగా 15 రోజుల్లోనే ఎన్నులు తీయడం ఫైర్ ఎదగకపోవడం వల్ల కల్తీ విత్తనాలతో నష్టపోయిన సుమారు 250 మంది రైతులకు ప్రభుత్వం వెంటనే ఎకరాకు 62000 నష్టపరిహారం చెల్లించాలని. ఈ కల్తీ విత్తనాల అమ్మిన సులూరుపేట పూజిత ఆగ్రో సర్వీస్ సెంటర్ యాజమాని శ్రీధర్ రెడ్డిని చట్టప్రకారం చర్యలు తీసుకుని అరెస్ట్ చేయాలని తిరుపతి జిల్లా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కన్వీనర్ సుధాకర్ రెడ్డి భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ సత్యవేడు నియోజకవర్గ కార్యదర్శి ఆంబాకం చిన్ని రాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వరదయ్యపాలెం మండలంలోని మావిళ్ళపాడు కలతూరు కొవ్వా కొల్లి మరదవాడ అంగూరు సాతంబేడు తదితర గ్రామాల రైతులు సుమారు 250 నోట్ల విత్తనాలు నారు పోసి నాటి తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మీ ఎక్కువ మంది రైతులు భూములను కౌలుకు తీసుకొని ఈ వ్యవసాయ సాగు చేస్తున్నారని కల్తీ విత్తనాల వల్ల నష్టపోయిన భూమి గల యజమానులకు కవులు డబ్బులు చెల్లించాల్సి వస్తుందని రైతులు తీవ్ర ఆవేదనకు గురి ఆందోళన చెందుతున్నారని పై నాయకులు తెలియజేశారు. ఈరోజు సుధాకర్ రెడ్డి చిన్ని రాజ్ నాయకత్వన్న వరదయ్యపాలెం మండలంలోని గ్రామాల పొలాలలో క్షేత్రస్థాయిలో వెళ్లి రైతులతో కలిసి పరిశీలించడం జరిగిందని ఆ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కవులకు తీసుకుని వ్యవసాయం చేస్తున్న మాకు ఈ కల్తీ విత్తనాలు వల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ప్రభుత్వం వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి భూములను సరియైన నిర్వహించి రైతులను గుర్తించి పరిహారం చెల్లించాలని లేకుంటే ఆత్మహత్య చేసుకోవడమే తప్ప వేరే గత్యంతరం లేదని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ధనుంజయులు శెట్టి చంద్ర. ధనంజయల్ నాయుడు చలపతి నాయుడు విజయ ఉప్పరపాటి మునిరాజా యువరాజు తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర భవిష్యత్తుకు ప్లాస్మా సాంకేతికతే కీలకం

డైరెక్టర్ ప్రొఫెసర్ కేఎస్ సత్యనారాయణ

విశాలాంధ్ర-ఏర్పేడు: నేటి ఆధునిక యుగంలో సుస్థిర అభివృద్ధి సాధించడంలో ప్లాస్మా సైన్స్ అండ్ టెక్నాలజీ కీలక పాత్ర పోషిస్తుందని ఐఐటీ తిరుపతి డైరెక్టర్ ప్రొఫెసర్ కేఎస్ సత్యనారాయణ పేర్కొన్నారు. ఐఐటీ తిరుపతిలోని ఫిజిక్స్, సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ విభాగాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న '40వ జాతీయ ప్లాస్మా సైన్స్ అండ్ టెక్నాలజీ' మూడు రోజుల సదస్సు ఆదివారం క్యాంపస్‌లో ఘనంగా ప్రారంభమైంది. ఐసర్ తిరుపతి, ప్లాస్మా సైన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా, కామోస్ట్ సంస్థల సహకారంతో ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రొఫెసర్ సత్యనారాయణ జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... క్లీన్ ఎనర్జీ, సెమీకండక్టర్ టెక్నాలజీ, అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్ వంటి జాతీయ ప్రాధాన్యత కలిగిన రంగాలలో ప్లాస్మా శాస్త్రం ఎంతో ప్రాముఖ్యత సంతరించు కుందన్నారు. అత్యాధునిక పరిశోధనలకు ఐఐటీ తిరుపతిని ఒక హబ్‌గా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని... ఇటువంటి జాతీయ సదస్సులు యువ పరిశోధకులకు అద్భుతమైన వేదికలని ఆయన కొనియాడారు. 'సుస్థిర భవిష్యత్తు కోసం ప్లాస్మా' అనే ఇతివృత్తంతో జరుగుతున్న ఈ సదస్సులో దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ మూడు రోజుల పాటు వివిధ సాంకేతిక అంశాలపై చర్చలు జరగనున్నాయి. ఫ్యూజన్ ఎనర్జీ, స్పేస్ ప్లాస్మా వంటి విభాగాల్లో వస్తున్న మార్పులు... మెటీరియల్ ప్రాసెసింగ్, బయో మెడికల్ రంగాల్లో ప్లాస్మా వినియోగం... లో-టెంపరేచర్ ప్లాస్మాపై ప్రత్యేక పరిశోధనా పత్రాల సమర్పణ జరగనున్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన టెక్నికల్ సెషన్లలో ఆహ్వానిత ప్రసంగాలు, ఓరల్, పోస్టర్ ప్రెజెంటేషన్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్లాస్మా పరిశోధనల్లో ప్రతిభ కనబరిచిన వారికి అవార్డులను కూడా అందజేయనున్నారు. వివిధ జాతీయ పరిశోధనా సంస్థల ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతోనే ఆరోగ్యం

ప్రగతి సంస్థ డైరెక్టర్ కే.వీ.రమణ

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: రసాయనాల్లేని ప్రకృతి వ్యవసాయం ద్వారానే భూసారం కాపాడటంతో పాటు మానవ ఆరోగ్యాన్ని రక్షించుకోగలమని ప్రగతి సంస్థ డైరెక్టర్ కే.వీ. రమణ పేర్కొన్నారు. అజీమ్ ప్రేమ్ జీ ఫౌండేషన్ సహకారంతో కేవీబీ పురం మండలం, కొండల్లో ఆదవరం గ్రామంలో శనివారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ద్రవ జీవామృతం తయారీ కోసం 40 మంది రైతులకు ఉచితంగా డ్రమ్ములను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత మూడు దశాబ్దాలుగా విచ్చలవిడిగా వాడుతున్న రసాయన ఎరువుల వల్ల భూమి నిస్సారమైపోవడమే కాకుండా, పండించిన ఆహారం తిని ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మన పూర్వీకుల అడుగుజాడల్లో ప్రకృతిలో లభించే వనరులతోనే వ్యవసాయం చేసి నాణ్యమైన దిగుబడులు సాధించాలని రైతులకు పిలుపునిచ్చారు. జీవామృతం పంటకు ఎరువుగా మాత్రమే కాకుండా, భూమిలో సూక్ష్మజీవుల వృద్ధికి ఎంతో దోహదపడుతుందని రమణ వివరించారు. ప్రకృతి వ్యవసాయంలో జీవామృతం అత్యంత కీలకమని, ప్రతి రైతు దీనిని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రగతి సంస్థ ప్రతినిధులు గిరీష్, ప్రభాకర్, గుణశేఖర్, కుమార్ రత్నం, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది రేణుక, బుజ్జమ్మ, సరిత, రైతులు పాల్గొన్నారు.

భవనాలు ఉన్నా నిరుపయోగం

విశాలాంధ్ర-బుచ్చినాయుడు కండ్రిగ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాలు నిరుపయోగంగా మారాయి. మండలంలోని పార్లపల్లి గ్రామ పంచాయతీ లో సచివాలయం భవనం రెండు అంతస్తులు కలిగిన భవనాన్ని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సుమారు 40 లక్షల రూపాయలు వ్యయంతో నిర్మించారు. కొన్ని కారణాలవల్ల పరిపాలన కొనసాగించుటకు అధికారులు ఆసక్తి చూపటం లేదు, విధులు నిర్వహించడానికి యోగ్యముగా ఉన్న. భవనం అయోగ్యముగా ఉండడంతో ముళ్ళ పొదలు పెరిగిపోతున్నాయి. అధికారులు భవనాలను వినియోగంలోకి తేవడంలో విఫలమవుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. నిర్మించిన భవనాలు సరైన ఉపయోగం లేకుండా ఖాళీగా ఉండడం వాటిని పట్టించుకోకపోవడం దౌర్భాగ్యంగా ఉన్నది. దీనివల్ల ప్రభుత్వ ఆస్తులు వృథా అవుతున్నాయి మరియు నిర్వహణ ఖర్చులు పెరిగిపోతున్నాయి. ప్రజలకు ఉపయోగపడకుండా ప్రభుత్వ ఆస్తులు వృథా అయిపోతున్నాయి. సచివాలయం సిబ్బంది పాత పంచాయతీ భవనంలోనే విధులు నిర్వహిస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి భవనం ఉపయోగం లోకి తేవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రముఖ న్యాయవాది శైలేంద్ర కుమార్‌కు డాక్టరేట్

విశాలాంధ్ర-పుంగనూరు: పట్టణంలో అందరికీ సుపరిచితుడు బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి ఉచిత న్యాయ సలహాదారుడు ఏపీ భూమి హక్కు చట్టం 2002 కు వ్యతిరేకంగా పోరాడిన వ్యక్తి ఎటువంటి ఫిర్యాదులు సమస్యలు లేకుండా న్యాయవృత్తిని కొనసాగించిన వ్యక్తి కావడంతో శైలేంద్ర పనితీరును 25 సంవత్సరాలు ఆయన చేసిన సేవను గుర్తించి ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ వారు ఆయనకు గౌరవ డాక్టరేట్ ప్రధానం చేయడం జరిగింది సెలవులు న్యాయవాదులు ఆయనను అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ రైతు ప్రథమ మహాసభను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-వరదయ్యపాలెం: డిసెంబర్ 29వ తేదీ సోమవారం శ్రీకాళహస్తి లోని పాత బైపాస్ రోడ్డు రోటరీ క్లబ్ హాలు నందు తిరుపతి జిల్లా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మొదటి మహాసభ జరుగుతుందని ఈ మహాసభను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు సుధాకర్ రెడ్డి చినిరాజ్ రైతులకు పిలుపునిచ్చారు. రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వాలని. స్వామినాథన్ కమిషన్ చేసిన సిఫార్సులను అమలు చేయాలని నిమ్మ జామాయిల్ మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతులకు యూరియా ఇతర రసాయన ఎరువులు కీటక నాశన మందులు వ్యవసాయ ఉపకరణాలు సరసమైన ధరలకు ప్రభుత్వమే అందించాలని దళారీ వ్యవస్థను అరికట్టి రైతులు పండించే వరి వేరుశనగ ఇతర పంటలను గిట్టుబాటు ధరతో ప్రభుత్వమే కొనుగోలు చేయాలని జిల్లాలో చెరుకు రైతులకు రావలసిన బకాయిలను వెంటనే ఇవ్వాలని రైతులకు పంట నిల్వ చేసుకోవడానికి స్టోరేజ్ గోడౌన్లను నియోజకవర్గానికి చొప్పున ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని కల్తీ విత్తనాలు పురుగు మందులు రసాయనక ఎరువులు వల్ల నష్టపోయిన రైతుల రైతులు ఎదుర్కొంటున్న సమస్యలన్నీ శ్రీకాళహస్తిలో జరుగుతున్న మహాసభలు చర్చించడం జరుగుతుందని అందువల్ల రైతులందరూ పాల్గొని జయప్రదం చేయాలని సుధాకర్ రెడ్డి చిన్ని రాజు పిలుపునిచ్చారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ

విశాలాంధ్ర-పుంగనూరు: పట్టణంలోని మేలుపట్ల ప్రాంతంలో అనారోగ్యంతో వైద్యశాల నందు చికిత్స పొందుతూ సీఎం రిలీఫ్ ఫండ్ ను ఆశ్రయించడంతో స్థానిక టిడిపి యువనేత దినేష్ ఆధ్వర్యంలో సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు కావడం జరిగింది ఈ సీఎం రిలీఫ్ ఫండ్ ను బాధితులైన ముగ్గురికి చెక్కులను యువ నాయకుడు దినేష్ పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా దినేష్ మాట్లాడుతూ సీఎం ఇచ్చిన ఈ చెక్కులను సద్వినియోగం చేసుకుని తమ ఆరోగ్య సమస్యలను పరిష్కరించుకోవాలని కోరడం జరిగింది. అనారోగ్యంతో బాధపడుతున్న అభాగ్యులను ఆదుకునే ఏకైక ప్రభుత్వం టిడిపి ప్రభుత్వమని ఆయన పేర్కొన్నారు.

శివయ్య సేవలో అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాజీవ్ సింగ్ ఆదివారం కుటుంబ సమేతంగా శ్రీకాళహస్తీశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు దేవస్థాన అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన అంతరాలయంలో స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా... అధికారులు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓలు విద్యాసాగర్ రెడ్డి, మోహన్, పర్యవేక్షకులు నాగభూషణం, ఏపీఆర్వో రవి, స్థానిక కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో గ్రామీణ రోడ్లకు మహర్దశ: ఎమ్మెల్యే కోనేటి

రూ.12 లక్షల వ్యయంతో మెటల్ రోడ్డుకు భూమి పూజ

విశాలాంధ్ర-పిచ్చాటూరు: కూటమి ప్రభుత్వంలో గ్రామీణ రోడ్లకు మహర్దశ కలుగుతున్నట్లు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. ఆదివారం పిచ్చాటూరు గంగమ్మ గుడి నుండి శ్మశానం వరకు రూ.12 లక్షల తో నిర్మించ తలపెట్టిన మెటల్ రోడ్డుకు ఎమ్మెల్యే ఆదిమూలం చేతుల మీదుగా భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్నీ రోడ్లు అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. అలాగే నారాయణవనం ఎన్టీఆర్ కాలనీ, పిచ్చాటూరు మండలం లోని ఎస్ ఎస్‌బి పేట తో పాటు మిగిలిన అన్నీ మండలాల్లో ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి పట్టాలు పంపిణీ చేయడానికి శాయశక్తులా కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కి అధికారులు కూడా సహకరించాలని ఆయన కోరారు.అనంతరం మెటల్ రోడ్డు నిర్మాణానికి శిలాఫలకం ప్రారంభం చేసి శంకు స్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మహమ్మద్ రఫీ, పిఆర్‌డి ఈ గోపాల్, ఎస్సై రాఘవేంద్ర, విద్యుత్తు ఏఈ సుబ్రహ్మణ్యం రెడ్డి, మాజీ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ డి.ఇలంగోవన్ రెడ్డి,ఆరనియార్ ప్రాజెక్ట్ చైర్మన్ రవి, వాసు, సుమాంజలి, ఎస్ ఎం సురేష్, దిలీప్, రవి, లైన్ మెన్ గిరి, సెల్వం రెడ్డి, సి.రుకేష్, వి.సత్యరాజ్ కూటమి పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కూటమి తోనే అభివృద్ధి సాధ్యం

తిరుపతి పార్లమెంట్ జిల్లా తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డి

విశాలాంధ్ర -గూడూరు: కూటమి తోనే అభివృద్ధి సాధ్యమని తిరుపతి పార్లమెంట్ తెలుగు మహిళ జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ చొరవతో గూడూరు మండల పరిధిలోని చెన్నూరు గ్రామంలోని అరుంధతీయవాడ నందు 20 లక్షల రూపాయలతో మూడు సి.సి. రోడ్లు, ఒక డ్రైన్ పనులకు తిరుపతి పార్లమెంట్ తెలుగు మహిళ జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా అభివృద్ధికి నోచుకోని చెన్నూరు అరుంధతీయ వాడ నందు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ చొరవతో అభివృద్ధి పనులు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం గూడూరు శాసన సభ్యులు పాశిం సునీల్ కుమార్‌కి అరుంధతీయ వాడ ప్రజలు, కూటమి నాయకులు, ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 24 సొసైటీ అధ్యక్షుడు అల్లూరు కరుణాకర్ రెడ్డి, నాయకులు మట్టం.మురళి, ముప్పాళ్ళ గిరి ప్రసాద్ రెడ్డి, పడాల. రత్నయ్య, ఇందుకూరు. శ్రీకాంత్ రెడ్డి, అల్లం. కృష్ణయ్య, ఉగ్గుమూడి.రవీంద్రారెడ్డి, ఏ.ఎం.సి డైరెక్టర్ మల్లి శ్యామల, ధర్మరాజుల స్వామి దేవస్థాన కమిటీ సభ్యులు కందుకూరు మౌనిక, ఉగ్గుమూడి మనోహర్ రెడ్డి, బూత్ కన్వీనర్లు శ్రీనివాసులు, రాజేంద్ర, రాజనాల, స్థానిక నాయకులు అనిల్, హరీష్, రమేష్, శంకరయ్య, నాయకులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ నవీన్ కుమార్ పాల్గొన్నారు.

కేఎల్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ 15వ స్నాతకోత్సవం

విశాలాంధ్ర-తిరుపతి: కేఎల్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ తన 15వ స్నాతకోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించింది. 2025 విద్యా సంవత్సరానికి చెందిన 5,000 మందికి పైగా విద్యార్థుల అకాడమిక్ ప్రయాణంలో ఇది ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. విశ్వవిద్యాలయ వడ్డేశ్వరం క్యాంపస్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమం, సంస్థలోని ఉన్నత విద్యా వ్యవస్థ యొక్క విస్తృతి, వైవిధ్యం, అకాడమిక్ లోతును ప్రతిబింబించింది. స్నాతకోత్సవం భావోద్వేగాలు, ఉత్సాహం, గర్వంతో నిండిన వాతావరణంలో సాగింది. సంవత్సరాల పాటు చేసిన కృషి, సాధించిన విజయాలను జరుపుకునేందుకు స్నాతకులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపకులు ఒకచోట చేరారు. ఈ కార్యక్రమానికి భారత జాతీయ విజ్ఞాన అకాడమీ అధ్యక్షుడు ప్రొఫెసర్ వినోద్ కె. సింగ్ ముఖ్య అతిథిగా హాజరై స్నాతకోత్సవ ప్రసంగం చేశారు. టాటా మెమోరియల్ సెంటర్ - గ్రామీణ అవుట్‌రీచ్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీపాద్ బనవల్లి గౌరవ అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా 184 మంది డాక్టరల్ స్కాలర్స్‌కు, 700 మందికి పైగా పీజీ విద్యార్థులకు, 4,500 మందికి పైగా అండర్‌గ్రాడ్యుయేట్ విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్, సైన్సెస్, లా, ఫార్మసీ, అగ్రికల్చర్, ఆర్కిటెక్చర్, హ్యూమానిటీస్ వంటి విభిన్న విభాగాలకు చెందిన విద్యార్థులు ఈ పట్టాలు పొందారు.

బంగారుపాలెంలో ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర-బంగారుపాలెం: లయన్స్ క్లబ్ ఆఫ్ చిత్తూరు, ఆస్టర్ నారాయణద్రి హాస్పిటల్ ఆధ్వర్యంలో బంగారుపాలెంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో జడ్పీ మాజీ చైర్మన్ కుమార్ రాజా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో దత్తాత్రేయ రెడ్డి, పి.బి. చంద్రశేఖర్, కృష్ణమూర్తి, కామరాజు, రఘుపతి రాజు, రియాజ్ భాషా తదితరులు పాల్గొని విజయవంతం చేశారు.

పుత్తూరు చర్చి ఆస్తులు అమ్మే హక్కు ఎవరికీ లేదు

విశాలాంధ్ర -పుత్తూరు: పుత్తూరులోని చర్చి కాంపౌండ్లోని ఆస్తులను అమ్మే హక్కు రాయలసీమలోని రెండు క్రైస్తవ సంఘాలకు లేదని చర్చి పాస్టర్ ఎ.బాబు తెలిపారు. ఆదివారం చర్చి ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గోవిందపాళెం రెవెన్యూ లెక్క దాఖలా సర్వే నెంబర్ 238/3లో 5.28 ఎకరాల్లో లూథరన్ చర్చి ఆస్తులు విస్తరించి ఉన్నాయని వెల్లడించారు. రాయలసీమలోని దక్షిణాంధ్ర లూథరన్ సంఘం 2001లో అంతర్గత విభేదాలతో రెండుగా విడిపోయిందన్నారు. ఈ నేపథ్యంలో రాయలసీమ వ్యాప్తంగా జరుగుతున్న అక్రమ క్రయ విక్రయాలపై హైకోర్టులో సీఆర్పీ నెంబర్ 1147/2012 నుంచి ఇంజక్షన్ ఆర్డర్ కొనసాగుతోందని వివరించారు. అయినా ఓ గ్రూపుకు చెందిన వారి నుంచి పుత్తూరు పట్టణానికి చెందిన కొందరు వ్యక్తులు స్థానిక చర్చి కాంపౌండ్లోని 1.98 ఎకరాల స్థలాన్ని అక్రమంగా కొనుగోలు చేశారని తెలిపారు. ఇలా అక్రమ కొనుగోలుకు పాల్పడిన వారు ఆదివారం సదరు స్థలాన్ని ఆక్రమించడానికి రాగా తాము అడ్డుకొన్నట్లు తెలిపారు. క్రైస్తవ ఆస్తుల పరిరక్షణకు అధికారులు, స్థానిక ప్రజలు సహకరించాలని కోరారు. సమావేశంలో కృష్ణసముద్రం పాస్టర్ జె. జాన్సన్, నందిమంగళం పాల్, భీమునిచెరువు కె.యాకోబ్, పచ్చికాపలం ఎం.ధర్మదొరై, నింద్ర శరతాబాబు పాల్గొన్నారు.

ముసలిపేడులో ఉచిత వైద్య శిబిరం

120 మందికి వైద్య పరీక్షలు

విశాలాంధ్ర-ఏర్పేడు: మండల పరిధిలోని ముసలిపేడు గ్రామ సచివాలయం వద్ద తిరుపతికి చెందిన డీఎన్ఆర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో సుమారు 120 మంది గ్రామస్తులకు వైద్యులు ఉచితంగా పరీక్షలు నిర్వహించి, సలహాలతో పాటు మందులను పంపిణీ చేశారు. వైద్య శిబిరం విజయవంతం కావడం పట్ల డీఎన్ఆర్ హాస్పిటల్ యాజమాన్యంతో పాటు ముసలిపేడు గ్రామ పెద్దలు, మాజీ సర్పంచులు వై. మనోహర్ నాయుడు, అంకయ్య హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జి. రాజారెడ్డి, సి. చెంగలరాయలు, ఎస్. దినకర్ నాయుడు, ఎ. మధు, వై. సుధాకర్ నాయుడు, ఎస్. రామమూర్తి, సి. బత్తెయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: భారత జాతీయ కాంగ్రెస్ 141వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం శ్రీకాళహస్తిలో తలపా దామోదరం రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి, కేక్ కట్ చేశారు. అనంతరం పార్టీకి సుదీర్ఘకాలం సేవలందించిన పీసీసీ ప్రధాన కార్యదర్శి తమటం వెంకటనరసింహులును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దామోదరం రెడ్డి మాట్లాడుతూ... దేశానికి స్వేచ్ఛను అందించడంతో పాటు ఐఐటీలు, ఇస్రో వంటి సంస్థల స్థాపన ద్వారా దేశాభివృద్ధికి బాటలు వేసిన ఘనత కాంగ్రెస్‌దేనన్నారు. పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి నాయకత్వంలో పార్టీకి పూర్వవైభవం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు జ్యోతిశ్వర్ నాయక్, సురేంద్ర రెడ్డి, రాహుల్ రాయల్, ఆంటోని పాల్గొన్నారు.

గీతా గోవిందం సేవా సమితి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర-కార్వేటినగరం: గీతా గోవిందం సేవాసమితి ట్రస్ట్ తిరుపతి వారి ఆధ్వర్యంలో డి ఎం పురం భజన మందిరం పక్కన ఉన్న మైదానంలో ఆదివారం సర్పంచ్ తులసి కృష్ణ యాదవ్ సమక్షంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్టు ప్రెసిడెంట్ బాల గురప్ప మాట్లాడుతూ బడుగు బలహీనవర్గాలకు హార్దికంగా వెరకపడ్డ వర్గాల కోసం ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. వైద్య అధికారులు డాక్టర్ కే శ్రీధర్, డాక్టర్ కెవిఎన్ సృజన, డాక్టర్ నాగలక్ష్మి, డాక్టర్ రమ్య, డాక్టర్ రాజారాం, డాక్టర్ యశ్వంత్, డాక్టర్ గీత సౌజన్య, కె.వి చంద్రిక, కన్ను, కీళ్ల నొప్పులు, శ్వాస, చెవి ముక్కు గొంతు, నరాలు అన్ని రకాల జబ్బులకు రోగుల్ని పరీక్షించి ఉచితంగా మందులు మాత్రలు పంపిణీ చేశారు. ఈ శిబిరానికి ద్వారకానగరం, కరవాటి కండిగా, గొల్ల కంటిగా, మిట్ట కండిగా, డిఎం పురం, మూల కండిగ తదితర ప్రాంతాల నుంచి రోగులు 209 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ వెంకటరమణ,, ఫౌండర్ ప్రెసిడెంట్ దామోదరం, కార్యదర్శి గుణశేఖర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి మునీంద్ర, డాక్టర్ మధుసూదన్, పద్మావతి, మాజీ సర్పంచ్ వెంకట ముని, భీమారావు, నరేంద్ర, శ్యాం బాబు రోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఇలాంటి శిబిరాలు పెట్టడం వల్ల పేదలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

వృద్ధులకు అన్నదానం

విశాలాంధ్ర-కార్వేటినగరం: కార్వేటినగరంలోని వృద్ధాశ్రమంలో ఎం.నిఖిత 27వ పుట్టిన రోజును పురస్కరించుకొని వృద్ధాశ్రమంలో కేక్‌ని కట్ చేసి వృద్ధులకు పంపిణీ చేశారు. అనంతరం మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. పిఎస్ సిఎస్ చైర్మన్ ఎం.జనార్దన్ రాజు, ఏం మురళీకృష్ణ, సీఈఓ దుష్యంత్ రెడ్డి, చిత్తూరు పార్లమెంటు అధికారి ప్రతినిధి మురళి, ప్రసాద్, సుమన్, అప్పలరాజు, సూపర్వైజర్ ప్రకాష్, వృద్ధులు పాల్గొన్నారు.

పిల్లలు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండడానికి బేబీ ఒలింపిక్ గేమ్స్ దోహదపడతాయి

శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు

విశాలాంధ్ర-తిరుపతి: ఫేస్ - ఎంటర్టైన్మెంట్స్ ఆధ్వర్యంలో తిరుపతిలో నిర్వహించిన న్యూ ఇండియా బేబీ ఒలింపిక్ గేమ్స్ సెకండ్ ఎడిషన్‌ను శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రవి నాయుడు మాట్లాడుతూ బేబీ ఒలింపిక్ గేమ్స్ వంటి కార్యక్రమాలు పిల్లలు శారీరకంగా బలంగా, మానసికంగా ఆరోగ్యంగా ఎదగడానికి ఎంతో దోహదపడతాయని తెలిపారు. చిన్న వయస్సులోనే శరీర కదలికలు, సమతుల్యత, సమన్వయం వంటి నైపుణ్యాలు అభివృద్ధి చెందేందుకు ఈ గేమ్స్ ఉపయోగపడతాయని అన్నారు. అలాగే, ఈ పోటీలు పిల్లల్లో చురుకుదనం, శక్తి పెంపొందించడంతో పాటు ఆత్మవిశ్వాసాన్ని కూడా పెంచుతాయని తెలిపారు. జట్టుగా పని చేయడం, భాగస్వామ్యం, సాధారణ నియమాలను పాటించడం వంటి విలువలు చిన్నప్పటి నుంచే అలవడతాయని పేర్కొన్నారు. బేబీ ఒలింపిక్ గేమ్స్ ద్వారా పిల్లల్లో ఆనందాన్ని పెంచడమే కాకుండా, ఆరోగ్యకరమైన జీవనశైలికి పునాది పడుతుందని రవి నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో బేబీ ఒలంపిక్ గేమ్స్ నిర్వాహకులు శ్రీకర్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ తోట వాసు, మారుతి హాస్పిటల్ మారుతి, కీర్తి, మదర్ హాస్పిటల్ పద్మజ, తానికొండ రంజిత్ నాయుడు, మధు, పవన్, గోపి పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-తిరుపతి: ప్రతి సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో డిసెంబర్ 29 వ తేది సోమవారం ఉదయం 10 గంటల నుండి 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం, 10.30 నుండి 11.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఫోన్ ద్వారా ఫిర్యాదులు చేసేవారు 0877-2227208 కి కాల్ చేసి మాట్లాడవచ్చని, ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తిరుపతి ప్రజలకు కమిషనర్ ఎన్.మౌర్య తెలియజేశారు.

'డ్రంక్ అండ్ డ్రైవ్' తనిఖీలు

ఆరుగురికి రూ.60 వేల జరిమానా

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు, శ్రీకాళహస్తి వన్ టౌన్ పోలీసులు పట్టణంలో విస్తృతంగా 'డ్రంక్ అండ్ డ్రైవ్' తనిఖీలు నిర్వహించారు. డీఎస్పీ నరసింహమూర్తి పర్యవేక్షణలో జరిగిన ఈ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ఆరుగురిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. పట్టుబడిన నిందితులను శ్రీకాళహస్తి జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా... న్యాయమూర్తి విచారణ అనంతరం ఒక్కొక్కరికి రూ. 10వేలు చొప్పున మొత్తం రూ. 60వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. కాగా మద్యం సేవించి వాహనం నడపడం ప్రాణాంతకమని... ఇది శిక్షార్హమైన నేరమని వన్ టౌన్ సీఐ ప్రకాష్ కుమార్ . రోడ్డు భద్రత దృష్ట్యా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని... భవిష్యత్తులో తనిఖీలు మరింత కఠినంగా ఉంటాయని స్పష్టం చేశారు. ప్రమాద రహిత సమాజం కోసం వాహనదారులు పోలీసులకు సహకరించాలని ఈ సందర్భంగా సీఐ విజ్ఞప్తి చేశారు.

శ్రీ వైకుంఠ ఏకాదశి మహోత్సవ ఆహ్వానం

విశ్రాంత ఎస్పీ రమేషయ్య పిలుపు

విశాలాంధ్ర-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని ప్రజలకు శ్రీ వైకుంఠ ఏకాదశి మహోత్సవ ఆహ్వానం అందుకుని ముక్కోటి ఏకాదశి హాజరుకావాలని విశ్రాంతి ఎస్పీ పొచమనేని రమేషయ్య నాయుడు ఆదివారం ఆహ్వానం పలుకుతున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రియమైన భక్తులారా, శ్రీమన్నారాయణ మూర్తి అనుగ్రహంతో, ఈ సంవత్సరం వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని, మండల ప్రజలు కుటుంబ సభ్యులందరం కలిసి మండల కేంద్రంలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వరదరాజులు దేవాలయంనందు శ్రీవారికి ప్రత్యేక పూజలు మరియు అభిషేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ శుభసందర్భంగా, మీరు మీ కుటుంబ సభ్యులతో సహా మన దేవాలయానికి విచ్చేసి, అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుని దివ్య దర్శనం చేసుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులు కాగలరు. డిసెంబర్ 30, మంగళవారం డిసెంబర్ 31, బుధవారం సాయంత్రం 6 గంటలకు దేవాలయ మండపం గీతా మందిరం ప్రాంగణము నందు భక్తులచే కోలాటం మరియు భజన ఏర్పాటు చేస్తున్నారు. మూడు రోజులు పాటు ఉత్తర ద్వార దర్శనం ప్రత్యేకంగా ఉంటుందన్నారు. భక్తులు ఉత్తర ద్వారం నుండి స్వామిని దర్శించుకుని ఏర్పాట్లు చేశామన్నారు. జనవరి 1వ తేదీన నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని 2026 గురువారం భక్తిశ్రద్ధలతో ఇంటికి వెళ్లాలన్నారు. గ్రామ పెద్దలు దేవాలయ అభివృద్ధి కమిటీ ఆహ్వానిస్తున్నదన్నారు.

గంధోత్సవం విజయవంతం పట్ల నిర్వాహకులు హర్షం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: పట్టణంలోని పానగల్‌లో ఉన్న దర్గాలో ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు జరిగిన గంధోత్సవం విజయవంతంపై హర్షం వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ దర్గా పీఠాధిపతి సయ్యద అహ్మద్, నిర్వాహకులు సయ్యద్‌బాబా ఫరీద్ ఆధ్వర్యంలో విజయవంతంగా జరిగాయన్నారు. ఈ మహోత్సవానికి సినీనటుడు సుమన్, గజల్ గాయకుడు శ్రీనివాస్, విశ్రాంత ఎస్పీ రాజా సిగామణి వంటి ప్రముఖులు విచ్చేశారని తెలిపారు. పోలీసు అధికారులు గంధోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా తగు బందోబస్తు ఏర్పాటు చేశారని తెలిపారు. అదే విధంగా శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్యశిబిరం, పురపాలకసంఘం ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు భేష్‌గా ఉన్నాయన్నారు. ఇందకు ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో దర్గా ఉరుసు కమిటీ అధ్యక్షుడు ఓరుగంటి నాగేశ్వరరావు, గుమ్మళ్ల రాజేశ్వరరావు, గరికపాటి రమేష్‌బాబు, జమురుద్ బాషా, జమీల్‌బాషా, గౌస్ మొహియుద్దీన్, నజీర్ అహ్మద్, మహ్మద్ అన్సర్, ఉదయ్‌భాస్కర్, దిలావర్ హుస్సేన్, జుంలేషాసాహి, అమీన్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు యువత ముందడుగు

విశాలాంధ్ర-పుత్తూరు: మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత అని నెహ్రూ యువజన సేవా సంఘం అధ్యక్షురాలు జ్యోతి లక్ష్మి అన్నారు. ఆదివారం వడమాలపేట మండలం ఎస్.వి.పురం గ్రామంలో నెహ్రూ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో అంజెరమ్మ గుడి ఆవరణలో మొక్కల నాటే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కొబ్బరి, వేప, కానుగ, నేరేడు, ఉసిరి, మారేడు తదితర మొక్కలను నాటారు. రాష్ట్ర యువజన అవార్డు గ్రహీత వెంకమరాజు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే మొక్కల పెంపకం తప్పనిసరి అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘ సభ్యులు మురళి, రమణ రాజు, తులసి, నాదముని, ప్రవీణ్, వెంకమరాజు, చిరంజీవి, చెంగ్రాయులు, సురేష్, కన్నయ్య, సుబ్రహ్మణ్యం రాజు తదితరులు పాల్గొన్నారు.

పది మంది కంటే ఎక్కువ కార్మికులు ఉన్న సంస్థలకు ఈఎస్ఐసి రిజిస్ట్రేషన్ తప్పనిసరి

అసిస్టెంట్ డైరెక్టర్ మధుసూధన్

విశాలాంధ్ర-తిరుపతి: దుకాణాలు, వాణిజ్య సంస్థలు, రెస్టారెంట్లు, లాడ్జీలు, హోటళ్లు, ఫ్యాక్టరీలు, పాఠశాలలు, కళాశాలలు మొదలైన వాటిలో 10 మంది లేదా అంతకంటే ఎక్కువ కార్మికులు పనిచేస్తున్నట్లయితే, ఆ సంస్థలు తప్పనిసరిగా కార్మిక రాజ్య బీమా సంస్థ ఈ.ఎస్.ఐ.సి పరిధిలోకి వస్తాయని ఈఎస్ఐసి అసిస్టెంట్ డైరెక్టర్ ఎం. మధుసూధన్ తెలిపారు.ఈ మేరకు ఆదివారం తిరుపతిలోని జీవకోన విశ్వం హై స్కూల్లో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య వక్తగా పాల్గొని మాట్లాడారు.అర్హత కలిగిన దుకాణాలు, స్థాపనలు వెంటనే శ్రమ సువిధ మరియు ఈఎస్ఐసి పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025 పథకం ద్వారా అర్హత కలిగిన సంస్థలు 31.12.2025 లోపు రిజిస్ట్రేషన్ చేసుకుంటే, గత కాలానికి సంబంధించిన బకాయిలు, పరిశీలనలు, జరిమానాలు లేకుండా రిజిస్ట్రేషన్ అవకాశం కల్పిస్తామని తెలిపారు.ఈ పథకం ద్వారా బీమా చేయబడిన కార్మికులు మరియు వారి కుటుంబ సభ్యులు ఉచిత వైద్య సేవలు, ప్రమాద బీమా, వికలాంగ భద్రత, ప్రసూతి ప్రయోజనాలు సహా పలు సామాజిక సంక్షేమ పథకాల లబ్ధి పొందవచ్చని వివరించారు.ఈ కార్యక్రమంలో సామాజిక భద్రతాధికారి ఎల్. వేణుగోపాల్, ఈఎస్ఐసి తిరుపతి బ్రాంచ్ మేనేజర్ సి. నాగమణి, అప్పుస్మా రాయలసీమ జోన్ ప్రెసిడెంట్ డా ఎస్.విశ్వనాథ రెడ్డి మరియు అప్పుస్మా నాయకులు మరియు సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి: ఏఈకి గ్రామస్తుల వినతి

విశాలాంధ్ర - బంగారుపాళ్యం: మండలంలోని మొగిలి పంచాయతీ గౌరీశంకరపురంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని గ్రామస్తులు విద్యుత్ శాఖ ఏఈని కోరారు. ఆదివారం గ్రామంలో పర్యటించిన విద్యుత్ అధికారులకు గ్రామస్తులు తమ సమస్యలను వివరించారు.?గ్రామంలో పాతబడిన విద్యుత్ స్తంభాలు (డామేజ్ పోల్స్), తక్కువ ఎత్తులో ఉన్న వైర్లు ప్రమాదకరంగా మారాయని వారు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా మొగిలి గుడి వద్ద ఉన్న పాత ఐరన్ పోల్స్‌ను తొలగించి, వాటి స్థానంలో 11 మీటర్ల కొత్త పోల్స్‌ను ఏర్పాటు చేయాలని మొగిలి ప్రసాద్ నాయుడుతో కలిసి గ్రామస్తులు విన్నవించారు.ఏఈ సానుకూల స్పందన గ్రామస్తుల వినతిపై ఏఈ సానుకూలంగా స్పందించారు. విద్యుత్ సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా త్వరలోనే కొత్త పోల్స్ ఏర్పాటు పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మొగిలి గ్రామస్తులు, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

హథిరాం బావాజీ ఆలయ నిర్మాణానికి సహకరించాలి

తిరుపతి ప్రజలు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పుణ్యకార్యంలో భాగస్వాములు కావాలి

విశాలాంధ్ర -తిరుపతి రూరల్ : శ్రీ వెంకటేశ్వర స్వామివారితో సాక్షాత్తు పాచికలాడిన మహానుభావుడు శ్రీ స్వామి హథిరాం బావాజీ వారి స్మారకంగా నిర్మించబడుతున్న శ్రీ స్వామి హథిరాం బావాజీ నూతన ఆలయ నిర్మాణంపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆలయ వ్యవస్థాపకులు బుక్య శివ నాయక్ విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ స్వామి హథిరాం బావాజీ వారు కేవలం ఒక మహాసాధువే కాకుండా, త్యాగం, భక్తి, నిరహంకారానికి ప్రతీకగా నిలిచిన ఆధ్యాత్మిక మహానుభావుడని తెలిపారు. అటువంటి మహనీయుడి ఆలయాన్ని నిర్మించడం ప్రతి భక్తుడి అదృష్టమని, ఈ పుణ్యకార్యంలో తిరుపతి ప్రజలు, భక్తులు, దాతలు చురుకుగా పాల్గొనాలని కోరారు.అలాగే, ఈ నూతన ఆలయ నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపి, అవసరమైన సహకారం, అనుమతులు, మౌలిక వసతులు కల్పించి ఈ మహత్తర ఆధ్యాత్మిక కార్యాన్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా 14 కోట్ల బంజారా సమాజం తరపున నూతన సంవత్సర శుభాకాంక్షలు,మకర సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రతి ఒక్కరూ ఆలయ నిర్మాణంలో భాగస్వాములై స్వామివారి దివ్య ఆశీస్సులు పొందాలని కోరారు.

జిల్లాలో కార్డెన్ సెర్చ్ : ద్విచక్ర వాహనాలు సీజ్.

విశాలాంధ్ర -చిత్తూరు: జిల్లావ్యాప్తంగా ఆదివారం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా ఎటువంటి రికార్డు లేని ఒక ఆటో తోపాటు 57 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు 200 లీటర్ల నాటు సారాను ధ్వంసం చేశారు. చిత్తూరు టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో అనుమానితులైన నలుగురిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ తనిఖీలు ప్రధాన ఉద్దేశం నేరాలను ముందస్తుగా అరికట్టి ప్రజల్లో భద్రత వాతావరణాన్ని బలపరచడం అసాంఘిక కార్యక్రమాలను నిరోధించడం ముఖ్య లక్ష్యమని పోలీసు అధికారులు తెలిపారు. ఆదివారం వేకుజామున జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని పోలీసు అధికారులు తెలిపారు.

వినాయక స్వామి వారి సేవలో రాష్ట్ర పంచాయతీరాజ్ రూరల్ డెవలప్మెంట్ డైరెక్టర్

విశాలాంధ్ర పూతలపట్టు పూతలపట్టు నియోజకవర్గం ఐరాల మండలం, స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయక స్వామి స్వామివారిని దర్శించుకున్న రాష్ట్ర పంచాయతీరాజ్ రూరల్ డెవలప్మెంట్ డైరెక్టర్ స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారిని దర్శించుకున్న రాష్ట్ర పంచాయతీరాజ్ రూరల్ డెవలప్మెంట్ డైరెక్టర్ షణ్ముఖ కుమార్, స్వామి వారిని దర్శించుకున్నారు, వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు శేషవస్త్రం చిత్రపటాన్ని అందజేసిన దేవస్థానం చైర్మన్ సురేంద్ర బాబు అలియాస్ మణి నాయుడు ,ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపర్డెంట్ వాసు, టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజీ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో మరొకరికి ప్రాణదానం

విశాలాంధ్ర-కోట: రక్తదానం మరొకరికి ప్రాణదానంతో సమానమని గూడూరు పట్టణానికి చెందిన మేడి పల్స్ రక్త నిధి కేంద్రం ఇంచార్జ్ ఎం సురేష్ అన్నారు. కోటమండలం చెందోడు గ్రామంలో మాజీ ప్రధాని స్వర్గీయ అటల్ బిహారి వాజ్ పేయి 100వ జయంతిని పురస్కరించుకుని ఆదివారం ఎంవి రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ దాతల నుండి సేకరించిన రక్తాన్ని అన్ని పరీక్షలు నిర్వహించి అనంతరం అవసరమైన గర్భిణీ స్త్రీలకు,తల సేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు అందజేయడం జరుగుతుందన్నారు.గ్రామీణ ప్రాంతంలోని యువత రక్తదానంపై అపోహలు వీడి విరివిగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. అనంతరం దాతల నుండి రక్తాన్ని సేకరించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ విజయలక్ష్మి ఎం ధరణి రక్త నిధి కేంద్రం టెక్నీషియన్లు, రక్తదాతలు పాల్గొన్నారు.

బోయకొండలో వేలం ద్వారానే పొట్టేలు తలలు విక్రయాలు

విశాలాంధ్ర-చౌడేపల్లి: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ కు మొక్కులు చెల్లించువారు పొట్టేళ్లను అమ్మవారికి బలి ఇవ్వడం ఆనవాయితీగా వస్తున్నది బోయకొండ లో అధిక రేట్లు తలలు విక్రయిస్తున్నారని అపోహలు రావడంతో ఈవో ఏకాంబరం చర్యలు చేపట్టారు భక్తులకు వేలం ద్వారానే తలలో విక్రయించాలని ఆదేశాలు జారీ చేశారు 500 ,700 రూపాయల తోనే పొట్టేలు తలలు భక్తులకు ఇవ్వాలని తెలిపారు అదేవిధంగా ఆదివారం వచ్చిన భక్తులకు వేలం ద్వారానే విక్రయించారు ఈ కార్యక్రమంలో సోము మనీ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యంలో సీఐ ఆధ్వర్యంలో 'కార్డెన్ సెర్చ్'

విశాలాంధ్ర - బంగారుపాలెం : చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ డ్యూడీ ఆదేశాల మేరకు పలమనేరు డీఎస్పీ డేగల ప్రభాకర్ పర్యవేక్షణలో బంగారుపాళ్యం అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని బంగారుపాళ్యం సీఐ కత్తి శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది సమన్వయంతో చేపట్టారు.బంగారుపాళ్యం హెచ్‌డబ్ల్యూ పరిధిలో పాత నేరస్తుల నివాసాల్లో సోదాలు నిర్వహించి, డ్రగ్స్, గంజాయి వినియోగం, సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించారు. గంజాయి తాగేవారు, ఇతరులకు సరఫరా చేసే వ్యక్తుల ఇళ్లలో విస్తృత తనిఖీలు చేపట్టినట్లు సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా పాత నేరస్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ సామ్రాజ్, కానిస్టేబుల్ ద్వారక, నాటామై సుబ్రహ్మణ్యం తదితర పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

హమాలీ కార్మికులకు సంక్షేమ చట్టం ఏర్పాటు చేయాలి :పి మురళి

కార్మిక చట్టాల రద్దు వల్ల హమాలీ కార్మికులు ఉపాధి కోల్పోయే ప్రమాదముంది :కె రాధాకృష్ణ

విశాలాంధ్ర - తిరుపతి : శ్రీ బాలాజీ లారీ లోడింగ్అండ్ అన్ లోడింగ్ హమాలీ కార్మికుల తిరుపతి నగర 11వ మహాసభ గంధమనేని శివయ్య భవన్లో జరిగింది. ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి ఏఐటియుసి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శిలు ఎన్ చంద్రశేఖర్ రెడ్డి కే రాధాకృష్ణ సిపిఐ నగర కార్యదర్శి జల్లా విశ్వనాద్. ఏఐటియుసి నగర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కేవై రాజా హమాలీ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎన్ డి రవి బాబు లు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు మరియు ప్రసంగించారు ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ హమాలీ కార్మికులకు సంక్షేమ చట్టం ద్వారా కార్మికులను ఆదుకోవాలని హమాలీ రంగం సేవా రంగం గా ప్రభుత్వం గుర్తించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల వల్ల మరీ ముఖ్యంగా లేబర్ కోడ్ లు రావడం ద్వారా 8 గంటల పని విధానం 12 గంటలకు చేరుతుందని ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని హమాలీ కార్మికుల ఆరోగ్యం చెడిపోయే ప్రమాదం ఉందని ఇప్పటికే రిలయన్స్ డి మార్ట్ ఫ్లిప్ కార్ట్ పెద్ద పెద్ద భారీ షాపింగ్ మాల్ ల వల్ల పోటీ కార్మికులను పెట్టుకుని పనులు చేయించుకొని హమాలీ కార్మికుల కడుపు లు కొడుతున్నారని దీనికి వ్యతిరేకంగా రానున్న కాలంలో పెద్ద ఎత్తున పోరాటాలు సాగించవలసిన అవసరం ఎంతైనా ఉంది అని వారు అన్నారుహమాలీ కార్మికులకు సంక్షేమ చట్టం ఏర్పాటు చేయడం ద్వారా భవన నిర్మాణ కార్మిక సంక్షేమ సంఘం తరహా లో హమాలీ రంగాన్ని సేవా రంగంగా ప్రభుత్వం గుర్తించి హమాలీ కార్మికులను ఆదుకోవాలని హ మాలీ కార్మిక కుటుంబాలకు రక్షణగా నిలవాలని ఆ రకంగా హమాలీ కార్మిక సంక్షేమ చట్టం ఏర్పాటు చేయడం ద్వారా హమాలీ కార్మికులకు ఉపాధికి రక్షణ దొరుకుతుందని వారు అన్నారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల వల్ల ఏఐటియుసి పెద్ద ఎత్తున పోరాటాలు సాగిస్తోందని అందులో హ మాలీ కార్మికుల పెద్ద ఎత్తున పాల్గొనాలని అందుకు ఎర్రజెండా అండగా ఉంటుంది అని వారు అన్నారుగడిచిన రెండు సంవత్సరాల కాలంలో తిరుపతి నగరంలో హమాలీ కార్మికులు సాగించిన పోరాటాలు తీసుకువచ్చిన విజయాలను పెరిగిన కూలి రేట్లను హ మాలి కార్మిక సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన పోరాటాలను నగర ప్రధాన కార్యదర్శి ఎన్ డి రవి వివరించారు రానున్న రెండు సంవత్సరాల కాలంలో హమాలీ కార్మికుల కూలీరేట్ల పెంపు పో టి కార్మికుల నివారణ విస్తరణ దిశగా హమాలీ కార్మిక సంఘం పనిచేయాలని అయన అన్నారుఈ మహాసభల ప్రారంభం సందర్భంగా ఏఐటియుసి జెండాను హమాలీ వర్కర్స్ యూనియన్ సీనియర్ నాయకులు సుబ్రమణ్యం జెండాను ఆవిష్కరించారు ఈ మహాసభకు సెందిల్ అధ్యక్షత నిర్వహించారు వేదిక మీదకు నాయకులను హమాలీ వర్కర్స్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి ఎన్ డి రవి ఆహ్వానం పలికారు ఇంకా ఈ మహాసభలో ఏఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి గోవిందస్వామి మరియు నగర ఆఫీస్ బేరర్స్ శ్రీనివాసులు మహేంద్ర సురేష్ రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారుహమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు నాగరాజు చిన్నబ్బా మోహన్ కుమార్ లోకేష్ మహేష్ భాష గణేష్ మునికృష్ణ శ్రీనివాసులు సాంబయ్య పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు

కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్న ప్రభుత్వ పాఠశాల

విశాలాంధ్ర -వరదయ్యపాలెం : వరదయ్యపాలెం మండలం కలతూరు గ్రామంలో శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాల ఈ గ్రామంలో 10 సంవత్సరాలగా శిథిలావస్థలో ఉన్న పాఠశాల కు సంబంధించి ప్రభుత్వ అధికారులకు గ్రామస్తులు ఎన్నిసార్లు తమ ఆవేదనను విన్నవించుకున్నా అధికారులు పట్టించుకోవట్లేదు చిన్నపిల్లలు ఆ స్కూల్లో వెళ్లి చదువుకోవాలంటేనే భయపడుతున్నారు దీనివల్ల పిల్లలు చదువుకో అంతరాయం కలుగుతుంది దీనివల్ల పిల్లలు తల్లిదండ్రులు ఉపాధ్యాయులు కు కూడా పిల్లల పరిస్థితి ఈ విధంగా ఉంది అని వివరించారు మా పిల్లల పరిస్థితి గమనించి ఇకనైనా ప్రభుత్వ అధికారులు సరైన పాఠశాల ఏర్పాటు చేయవలసిందిగా కలుత్తూరు గ్రామస్తులు తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు

నగిరి నింద్ర విజయపురం మండలాలను తిరుపతి జిల్లాలో కలపాలి

నగిరి లో అఖిలపక్ష పోరాట సాధన సమితి ఆధ్వర్యంలో నగరి బస్టాండ్ లో మానవహారం

విశాలాంధ్ర-పుత్తూరు/నగరి: నగిరి నింద్ర విజయపురం మండలాలను తిరుపతి జిల్లాలో కలపాలని కోరుతూ అఖిలపక్ష పోరాట సాధన సమితి ఆధ్వర్యంలో ఆదివారం నగిరి బస్టాండ్ నందు మానవహారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ ప్రధానంగా నగిరి నియోజక వర్గాన్ని రెండుగా విభజించి పుత్తూరు వడమలపేట మండలాలను తిరుపతి జిల్లాలో నగరి విజయపురం మండలాలను చిత్తూరు జిల్లాలో కలపడం జరిగింది. కానీ నగిరి నింద్ర విజయపురాన్ని తిరుపతి జిల్లాలో కలుపుతామని ప్రతిపక్ష నాయకులు ప్రస్తుతం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బహిరంగ సభలో ప్రకటించడం జరిగింది. ఆ తర్వాత మంత్రుల సబ్ కమిటీ కూడా అన్ని విధాలుగా విద్యా వైద్య ఆరోగ్యపరంగా రవాణ సౌకర్యం పరంగా తిరుపతి జిల్లా ఈ మూడు మండలాలనూ తిరుపతిలో జిల్లాలో కలపాలని ప్రకటించారు.కానీ ఇప్పుడు నిన్న జరిగిన కేంద్ర క్యాబినెట్లో కనీసం మూడు మండలాల గురించి ఎలాంటి చర్చ లేకుండా యధావిధి కొనసాగుతాయని చెప్పడాన్ని మూడు మండల ప్రజలు బాధతో ఆవేదనతో బాధపడుతున్నారు కావున ఇప్పటికైనా. రాష్ట్ర.ముఖ్యమంత్రి వర్యులు మీరు అనుభవజ్ఞులు విద్య వైద్య రవాణా పరంగా తిరుపతి జిల్లా మూడు మండలాలకు అనుకూలం కావున మీరు ప్రకటించిన విధంగా మూడు మండలాల్లో తిరుపతి జిల్లాలో కలపాలని ఈరోజు మాధవరం నిర్వహించడం జరిగింది సోమవారం ఓం శక్తి గుడి నుంచి ర్యాలీగా వెళ్ళి ఆర్డీవో కార్యాలయం దగ్గర నిరసన తెలియపరుస్తూ అనంతరం ఆర్డీవో వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష పార్టీ నాయకులు కోదండయ్య బాబు మదన కుమార్ , వేలన్ గోపి రవి రాజవేలు సుబ్రమణ్యం సోము కన్నయ్య నాగూర్ నాగరాజు ప్రజా సంఘాల నాయకులు మునిరత్నం చంద్రశేఖర్ ప్రతాప్ ముత్తు సురేష్ నగోమి ధనలక్ష్మి హేమలత కలయివాని దీప నదియా మోహన్ బాబు వీరితోపాటు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలసిన జిల్లా ఉపాధ్యక్షురాలు

విశాలాంధ్ర-పలమనేరు : చిత్తూరు జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షురాలు కొలమాసనపల్లికి చెందిన పి.మంజులా రెడ్డి ఆదివారం పలమనేరు శాసనసభ్యులు అమర్నాథ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీకి తాను అందించిన సేవలను గుర్తించి జిల్లా ఉపాధ్యక్షురాలు పదవిని కట్టబెట్టినందుకు ధన్యవాదాలు తెలియజేస్తూ ఆమె ఎమ్మెల్యేను గజమాలతో సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. తనపై నమ్మకంతో జిల్లా పదవి కట్టబెట్టిన రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడుకు మరియు స్థానిక ఎమ్మెల్యేకు రుణపడి ఉంటానని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. పార్టీ పతిష్టతకు తన వంతు కృషి చేస్తానని అందరిని సమన్వయం చేసుకొని ముందుకు వెళ్తానన్నారు. ఈ కార్యక్రమంలో పలమనేరు మండల నాయకులు నాగరాజు రెడ్డి, సెల్వ రాజు, స్వతంత్ర బాబు, జగదీష్, వినోద్, నరేష్ రెడ్డి, భాస్కర్ నాయుడు,బేలుపల్లి క్రాస్ మణి, ఆనంద బాబు, మురళి, అమర్, సునీల్ రెడ్డప్ప పాల్గొన్నారు.

గణనాధుని సన్నిధిలో కర్ణాటక రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి



విశాలాంధ్ర-పూతలపట్టు: శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారిని దర్శించుకున్న కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హేమలేఖ , కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు.వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాటు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు శేషవస్త్రం చిత్రపటాన్ని అందజేసిన దేవస్థానం ఏఈవోలు రవీంద్రబాబు, ధనపాల్, ఈ కార్యక్రమంలో సూపర్డెంట్ కోదండపాణి, చిత్తూరు కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బోయకొండలో భక్తులరద్దీ

విశాలాంధ్ర-చౌడేపల్లి: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయం నందు ఆదివారం భక్తుల రద్దీ ఉదయం 5 గంటల నుండి చలి మంచు, లెక్కచే యకుండా క్యూ లైన్ లందు భక్తులు వేచి ఉన్నారు. అమ్మవారి దర్శనం కోసం కొండంత జనం కొండంత వాహనాలతో నిండిపోయిన బోయకొండ భక్తుల సౌకర్యార్థంగా ఆలయ ఈవో ఏకాంబరం ఆలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు త్రాగునీరు తీర్థప్రసాదాలు క్యూలైన్లందు క్రమశిక్షణ వాహనదారులకు కొండపై ఇబ్బంది లేకుండా సిబ్బందిని కూడా ఆదేశాలు జారీ చేశారు ప్రధాన అర్చకులు అమ్మవారిని ప్రత్యేక అలంకరణ లో భక్తులకు దర్శనం కల్పించారు ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సూపర్డెంట్ రామనాథం కృష్ణారెడ్డి సుధాకర్ రెడ్డి ముని రాజా తాతయ్య దొరస్వామి సురేంద్ర విజయ్ కుమార్ కిరణ్ మంజునాథ్ ముని రాజా చంగల్ రాయలు రమణ అర్చక సిబ్బంది గంగిరెడ్డి చంద్ర సుధాకర్ హరి ప్రసాద్ రాజన్న చిన్న గంగిరెడ్డి బాబు దాము వశిష్ట వేదపండితులు గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు

బైరెడ్డిపల్లిలో గంగమ్మకు పూజలు

విశాలాంధ్ర-బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి మండల కేంద్రంలోని గంగమ్మ గుడిలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కేంద్రంలోని అన్ని గంగరాళ్ళకు పూజలు చేసి పొంగిళ్లు పెట్టడం ఆయనవాయితీ. ఈ సందర్భంగా ఎద్దులకు,దున్నపోతులకు స్నానాలు చేయించి,పసుపు పెట్టి పూజలు చేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో మండల ప్రజలు బైరెడ్డిపల్లి తెలుగుదేశం మండల అధ్యక్షులు కిషోర్ గౌడ్ ఇంటి వద్దకు చేరి పూజా కార్యక్రమం ని ప్రారంభించడం జరిగినది.అనంతరం కట్టమీద గంగమ్మ,,బాట గంగమ్మ గుళ్ళల్లో పూజలు నిర్వహించారు. ఊరి పొలిమేరలో ఉన్నటువంటి గంగరాళ్లకు పూజలు చేయడం జరిగినది.

సిపిఐ శత జయంతి సందర్భంగా

పలమనేరులో ఎర్ర జండా ఆవిష్కరణ

ప్రజా సమస్యలపై పోరాటానికి సిపిఐ కార్యకర్తలు సన్నద్ధం కావాలి

సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి యస్. నాగరాజు పిలుపు

విశాలాంధ్ర- పలమనేరు : భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పలమనేరులో సిపిఐ పట్టణ కార్యదర్శి బుర్ర మంజునాథ్ బాబు నాయకత్వంలో పలమనేరు నియోజకవర్గ కార్యదర్శి చెన్నకేశవులు ఎర్రజెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ స్థాపించిన నాటి నుండి నేటి వరకు సిపిఐ అణగారిన ప్రజల కోసం,భూమి కోసం, బుక్తి కోసం పోరాటం చేసిన, చేస్తున్న పార్టీ సిపిఐ అని కొనియాడారు.భారతదేశ స్వాతంత్ర్యం ఉద్యమంలో పాల్గొన్న పార్టీ ఎర్రజెండా పార్టీ అన్నారు స్వాతంత్ర ఉద్యమంలో ఎలాంటి పాత్ర లేని పార్టీలు కూడా ఈరోజు ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వస్తున్నారని ఏద్దేవా చేశారు. భారత దేశ సమగ్రతకు,సమైక్యతకు కృషి చేసిన జెండా ఎర్ర జెండా సిపిఐ జెండా అధికారం లేకపోయినా రైతు, ఉద్యోగుల, కార్మికులు, మహిళా, విద్యార్థి యువజన దళిత, గిరిజనుల సమస్యల పైన నిరంతరం పోరాటాలు చేస్తూ సమస్యల పరిష్కారం కోసం అగ్రభాగాన సిపిఐ పార్టీ ఉందని అన్నారు. రానున్న రోజుల్లో సిపిఐ కార్యకర్తలు పలమనేరు పట్టణ అభివృద్ధి పైన ప్రజా సమస్యల పైన పోరాటానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలమనేరు పట్టణ సిపిఐ కార్యదర్శి బుర్ర మంజునాథ బాబు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు వి.రమేష్, జే.ఆర్. పల్లి శాఖ కార్యదర్శి శంకరప్ప, రవి ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు సంజయ్, అమీష సమీర్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు

ఘనంగా కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర -తిరుపతి : భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించి, 140 సంవత్సరాల పూర్తి చేసుకొని, 141 సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఆదివారం ఉదయం తిరుపతి నగరంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి, వేడుకలు జరుపుకున్నారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదురుగా ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకులు, తేజోవతి, ముని శోభ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు జరిగాయి.ఈ సందర్భంగా మహిళా కాంగ్రెస్ తిరుపతి జిల్లా మాజీ అధ్యక్షురాలు తేజోవతి, ముని శోభలు మీడియాతో మాట్లాడారు. భారతదేశానికి స్వతంత్రాన్ని తీసుకొచ్చి, సమానత్వాన్ని ఇచ్చి, అంటరానితనాన్ని రూపుమాపి, పత్రికా స్వేచ్ఛను ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. దేశ జబాలో 85% ఉన్న ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీలకు రిజర్వేషన్లు ఇచ్చి, తద్వారా పై వర్గాలు ఉన్నత విద్యను అభ్యసించి, నేడు ఉద్యోగాలు చేస్తున్నారని తెలిపారు. దేశంలో మారుమూల గ్రామాల్లో ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలలు, రోడ్లు, వీధిలైట్లు, ఇంటింటికి కరెంట్ ఇచ్చిన పార్టీ కాంగ్రెస్సేనని పేర్కొన్నారు. భారత జాతీయ కాంగ్రెస్ పార్టీలో పనిచేయడం తమకు చాలా గర్వకారణంగా ఉందన్నారు. నేడు కేంద్రంలో, రాష్ట్రంలో ఉన్న అధికార ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై కాంగ్రెస్ పార్టీ అలుపెరగని పోరాటం చేస్తోందన్నారు. పార్లమెంటులో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ గారు, కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే గారు, కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ గారి నేతృత్వంలో కాంగ్రెస్ శ్రేణులు ఎక్కడికక్కడ ఉద్యమించి, ప్రజల్లో చైతన్యం తీసుకొస్తున్నట్లు తెలిపారు. రాబోవు రోజుల్లో కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

విశాలాంధ్ర అక్షరాక్షరం అభ్యుదయం
సబ్-ఎడిటర్స్ కావలెను
తిరుపతి ఎడిషన్ ఆఫీసులో పనిచేయుటకు సబ్-ఎడిటర్స్ కావలెను.
తెలుగు భాషపై పట్టు, వార్తలు, సామాజిక, రాజకీయ అంశాలపై పరిజ్ఞానం కలిగి ఉండాలి.
విద్యార్హతలు: డిగ్రీ పాసైయుండి తెలుగు టైపింగ్, ఫొటో షాప్, క్వార్క్ ఎక్స్‌ప్రెస్‌లో పేజీలు పెట్టగలిగి ఉండాలి.
గమనిక: అనుభవము ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును
ఎడిషన్ మేనేజర్
అడ్రస్: విశాలాంధ్ర ఎడిషన్ కార్యాలయం, డోర్ నెం.9-91/5, ఇందిరమ్మ గృహాలు ఎదురుగా దామినేడు, తిరుపతి రూరల్. సెల్: 9490952129